పౌరసత్వం అంటారు
ప్రగల్భాలు పలుకుతారు,
గుర్తింపు చిహ్నం ఏదంటే
గుర్రుగా చూస్తారు !

ఆధార్, ఓటర్, పాన్...
పదకొండు కార్డులున్న,
పౌరసత్వ గుర్తింపుకు
పనికొచ్చేది సున్న!
..న్యాలకంటి నారాయణ

# కొత్తస్వరం

ప్రజాగొంతుక — తెలుగు దినపత్రిక

సంపుటి 14 | సంచిక 135 | kothaswaram2024@gmail.com | పేజీలు 08 | వెల రూ. 2.00

ఆంధ్రప్రదేశ్ — Published from Telangana & Andhra Pradesh — బుధవారం, జూలై 23, 2025


## జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

ఆదివాసీ గూడాల్లో ఆనందం
తమ పోరాటం ఫలించిందని సంబరం

వివరాలు 2లో



## ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

జగ్‌దీప్ ఆయురారోగ్యాలతో ఉండాలని మోదీ ఆకాంక్ష

వివరాలు 2లో

# జైలులో మిథున్ రెడ్డికి సకల సౌకర్యాలు

ఆదేశాలు జారీ చేసిన ఏసిబి కోర్టు

మద్యం నిందితుల రిమాండ్ పొడిగింపు



**విజయవాడ, జులై 22(కొత్తస్వరం) :**

మద్యం కుంభకోణం కేసులో అరెస్టయిన వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి పిటిషన్‌పై విజయవాడలోని ఏసీబీ కోర్టు విచారణ జరిపి ఆదేశాలు జారీ చేసింది. జైలులో ప్రత్యేక వసతులకు కోర్టు అనుమతి ఇచ్చింది. మంచం, దుప్పటి, దిండు, వాటర్ బాటిల్స్, కూలర్, పేపర్-పెన్ను, టేబుల్, ప్రొవిజన్ ఉంటే టీవీ అనుమతించాలని కోర్టు పేర్కొంది. పేపర్, వాటర్ బాటిల్స్, ఆహారం ఖర్చును మిథున్‌రెడ్డి భరించాలని స్పష్టం చేసింది. బయటి ఆహారం తీసుకువస్తే అండర్ టేకింగ్ లెటర్ ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. జైలులో ఉన్న వైద్య వసతి కల్పించాలని.. అవసరమైతే జైలు బయట వైద్య సౌకర్యం కల్పించాలని సూచించింది. న్యాయవాదులకు వారంలో మూడుసార్లు, బంధువులకు వారంలో రెండు సార్లు ములాఖత్‌లకు కోర్టు అనుమతి ఇచ్చింది. ఇదిలావుంటే మద్యం కుంభకోణం కేసులో నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. ఆగస్టు 1 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో 11 మంది నిందితులకు రిమాండ్ ముగియడంతో సిట్ అధికారులు మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు.. నిందితులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి సహా 11 మందికి రిమాండ్‌ను పొడిగించింది.




## కడప సెంట్రల్ జైలులో ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

జైలర్ అప్పారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్‌తో పాటు మరో ముగ్గురు సస్పెన్షన్
ఉత్తర్వులు జారీ చేసిన జైళ్ల శాఖ డీజీ
ఖైదీలకు సెల్ ఫోన్లు అందిస్తున్నారన్న ఆరోపణలతో విచారణ జరిపిన డీఐజీ

**కడప, జూలై 22 (కొత్తస్వరం) :**

కడప సెంట్రల్ జైలులో పనిచేస్తున్న ఇద్దరు అధికారులు, ముగ్గురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. జైలర్ అప్పారావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ తో పాటు మరో ముగ్గురు జైలు వార్డర్లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు జైళ్ల శాఖ డీజీ ఉత్తర్వులు జారీ చేశారు. జైలులో ఖైదీలకు సెల్ ఫోన్లు సరఫరా చేస్తున్నారని వీరిపై ఆరోపణలు వచ్చాయి. జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న ఎర్రచందనం స్మగ్లర్లకు మొబైల్ ఫోన్లు అందిస్తున్నారన్న అభియోగాలపై గత నాలుగు రోజులుగా జైళ్ల శాఖ డీఐజీ రవికిరణ్ విచారణ జరిపారు. ఆయన ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఈ చర్యలు చేపట్టారు.

## రాష్ట్రపతి ముర్ముతో డిప్యూటి చైర్మన్ హరివంశ్ భేటీ

మర్యాదపూర్వక భేటీ అంటూ ప్రకటన విడుదల

**న్యూఢిల్లీ,జులై 22(కొత్తస్వరం):**

రాజ్యసభ డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ మంగళవారం రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిశారు. సోమవారం సాయంత్రం జగదీప్ ధన్‌ఖర్ ఉప రాష్ట్రపతిగా రాజీనామా చేయగా మంగళశార్ రాష్ట్రపతి దానిని ఆమోదించారు. ఈ నేపథ్యంలో హరివంశ్ రాష్ట్రపతిని కలువడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రపతి భవన్ 'ఎక్స్' పోస్ట్‌లో భేటీకి సంబంధించిన చిత్రాన్ని షేర్ చేసింది. రాజ్యసభ డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసినట్లు- తెలిపింది. జగదీప్ ధన్‌ఖర్ పార్లమెంట్ వర్షాకాల సమావేశాల తొలిరోజే పదవికి

- మిగతా 2లో..



## సూపర్ సిక్స్‌లో అన్నీ అమలు చేశాం

మహిళలకు 1500 పథకం ఇవ్వాల్సి ఉంది
వ్యవసాయమంత్రి అచ్చన్నాయుడు

2





## డెలివరీ బాయ్ అత్యాచారం చేశాడని అబద్ధపు ఫిర్యాదు..

### మహిళా టెక్కీపై కేసు

డెలివరీ ఏజెంట్‌గా నటిస్తూ వచ్చి అత్యాచారం చేశాడని పుణే టెక్కీ ఫిర్యాదు
విచారణలో అబద్ధపు ఫిర్యాదు అని గుర్తించిన పోలీసులు
ఆమెపై ఎలాంటి అఘాయిత్యం జరగలేదని విచారణలో వెల్లడి

వివరాలు 7లో



## హోంగార్డులకు జీతాలుచెల్లించండి

ప్రభుత్వానికి హరీష్ రావు డిమాండ్



2

## రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్న సిఎం చంద్రబాబు

గత ప్రభుత్వ ఆర్థిక అరాచకంతో రాష్ట్రం అస్తవ్యస్తం
పురపాలక శాఖ మంత్రి నారాయణ

**మచిలీపట్నం,జులై 22(కొత్తస్వరం):**

ఏడాది ప్రభుత్వ పాలనపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా రూ.10లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్ళిపోయిందని విమర్శించారు. సీఎం చంద్రబాబుకు ఉన్న అనుభవంతో రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారని, ఇచ్చిన హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. పెడన మున్సిపాలిటీలో డ్రెయిన్ల నిర్మాణానికి రూ.2కోట్లు-, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ- హాల్ పెండింగ్ పనుల పూర్తికి రూ.25లక్షలు విడుదల చేస్తామని మంత్రి నారాయణ తెలిపారు. పెడనలో సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లిన మంత్రి.. ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని వెల్లడించారు. తల్లికి వందనం పథకం కింద రూ.10 వేల కోట్లు- ఖర్చుపెట్టామని చెప్పారు. కేంద్రం పీఎం కిసాన్ నిధులు విడుదల చేసే రోజే అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేలా ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పెడనలో వచ్చే రెండేళ్లలో అందరికీ తాగునీరు అందించేలా రూ.91.18 కోట్లతో పనులు చేపడుతున్నామని చెప్పారు.



## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

టీజీ టెట్ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థుల ఉత్తీర్ణత
జూన్ 18 నుంచి 30 వరకు జరిగిన పరీక్షలకు 1,37,429 మంది హాజరు
మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడి

**హైదరాబాద్, జూలై 22 (కొత్తస్వరం) :**

తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. జూన్ 18 నుంచి 30 వరకు నిర్వహించిన పరీ క్షకు 1,37,429 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ఫలితాల్లో 33.98 శాతం అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. మొత్తం మీద 30,649 మంది అభ్యర్థులు క్వాలిఫై అయినట్లు విద్యాశాఖ వెల్లడించింది. టెట్ ఫలితాలను విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఆన్ లైన్ లో నేరుగా విడుదల చేశారు. పేపర్ 1,2 లకు ఏడు భాషల్లో పరీక్ష నిర్వహించారు. పేపర్ 1 పరీక్షకు 47,224 మంది హాజరైతే.. 29,043 మంది పాస్ అయ్యారు. పేపర్ 2లో మ్యాథ్స్ అండ్ సైన్స్ పేపర్ లో 48,998 మంది పరీక్ష రాస్తే 17,574 మంది క్వాలిఫై అయ్యారు. పేపర్ 2 లోని సోషల్ స్టడీస్ లో 41,207 మంది ఎగ్జామ్ రాస్తే 13,075 మంది ఉత్తీర్ణులయ్యారు. అధికారిక వెబ్‌సైట్ http://tgtet.aptonline.in/tgtet/Result Frontలో అభ్యర్థులు తమ ఫలితాలు చూసుకోవచ్చని అధికారులు తెలిపారు.

# జివో 49పై వెనక్కి తగ్గిన ప్రభుత్వం

**ఆదివాసీ గూడాల్లో ఆనందం**

**తమ పోరాటం ఫలించిందని సంబరం**

**ఆదిలాబాద్,జూలై22(కొత్తస్వరంఎ):**

ఎక్కడో ఒకచోట పులి జాడలుకనిపిస్తేనే వణికిపోయిన గిరజనం ఇప్పుడు..కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ జోన్ ప్రకటనతో చలించిపోయింది. తాము ఉన్న ఊళ్లు వదలాల్సి వస్తుందని ఆందోళన చెందారు. అందుకు జీవో 49కి వ్యతిరేకంగా ఉద్యమించారు. జిల్లా బంద్ చేపట్టారు. జీవో 49ని రద్దు చేయాలని ఆదివాసీ, తుడుందెబ్బ సంఘాల ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఆసిఫాబాద్‌లో ఆదివాసీ, ఇతర సంఘాల నాయకులు ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ధర్నా చేశారు. కాగజ్‌నగర్‌లో ర్యాలీ తీశారు. మిగతా మండలాల్లో ఆదివాసీ, తుడుందెబ్బ నాయకులు నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో ఆదివాసీ, గిరిజన సంఘాలు రాస్తారోకో చేపట్టాయి. అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో నెన్నెలలో జీవో ప్రతులను దహనం చేశారు. కాసిపేట మండలంలో బంద్ నడిచింది. ఆదిలాబాద్‌లో ప్రధాన వీధుల గుండా ఆదివాసీ నేతలు ర్యాలీలు నిర్వహించి దుకాణాలను మూసి వేయించారు. బస్టాండ్, బస్ డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. గుడిహత్నూర్, ఉట్నూర్ మండల కేంద్రాల్లో వాణిజ్య సంస్థలు మూతబడ్డాయి. ఈ క్రమంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు జివోను రద్దు చేసేలా చేశారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఏర్పాటు చేయాలనుకున్న టైగర్ కన్జర్వేషన్ జోన్ విషయంలో సర్కారు వెనక్కి తగ్గింది. సుమారు 330 గ్రామాలను ప్రభావితం చేయనున్న ఈ పులుల సంరక్షణ కేంద్రంపై ఆదివాసీల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో ప్రభుత్వం పునరాలోచనలో పడింది. టైగర్ రిజర్వ్ ఏర్పాటు కోసం తీసుకువచ్చిన జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సోమవారం ప్రకటించింది. జీవో 49 విషయంలో ఇటీవల జరిగిన పరిణామాల నేపథ్యంలో కలెక్టర్ నుంచి సేకరించిన తాజా నివేదిక మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, కెరమెరి, రెబ్బెన, తిర్యాణి, కాగజ్‌నగర్, సిర్పూర్, కర్జెల్లి, బెజ్జూర్, పెంచికల్‌పేట్ రేంజ్‌లో లక్షా 49 వేల హెక్టార్లను -టైగర్ రిజర్వ్‌లోకి మారుస్తూ గత నెల 30న ప్రభుత్వం జీవో 49ని ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో 330 ప్రభావిత గ్రామాల్లో నెలకొన్న పరిస్థితులపై అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆదిలాబాద్ ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సమగ్ర వివరాలను సేకరించారు. వాస్తవ పరిస్థితులను సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. దీంతో జీవో 49ని తాత్కాలికంగా నిలిపివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కాగా, జీవో 49 నిలుపుదలపై హర్షం వ్యక్తం చేస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజాప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం కలిసి కృతజ్ఞతలు తెలపడంతో పాటు సన్మానించారు. సహకరించిన మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, కొండాసురేఖ, అడ్లూరి లక్ష్మణ్‌కు.. ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపూరావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు కృతజ్ఞతలు తెలిపారు.

## డెలివరీ బాయ్ అత్యాచారం చేశాడని అబద్ధపు ఫిర్యాదు.. మహిళా టెక్కీపై కేసు

**డెలివరీ ఏజెంట్‌గా నటిస్తూ వచ్చి అత్యాచారం చేశాడని పుణే టెక్కీ ఫిర్యాదు**

**విచారణలో అబద్ధపు ఫిర్యాదు అని గుర్తించిన పోలీసులు**

**ఆమెపై ఎలాంటి అఘాయిత్యం జరగలేదని విచారణలో వెల్లడి**

**పుణే, జూలై 22 (కొత్తస్వరం) :**

పుణేలో ఒక సంచలన ఘటన చోటుచేసుకుంది. ఓ డెలివరీ బాయ్ తనపై అత్యాచారం చేశాడని ఓ మహిళా టెక్కీ అబద్ధపు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆమెపైనే కేసు నమోదు చేశారు. ఈ నెల 3న 22 ఏళ్ల వయస్సున్న ఆ టెక్కీ పోలీసులకు ఫిర్యాదు చేస్తూ, డెలివరీ ఏజెంట్‌గా వచ్చిన ఒక వ్యక్తి తన ఫ్లాట్‌లోకి చొరబడి తనపై అత్యాచారం చేశాడని ఆరోపించింది. అంతేకాకుండా, ఆ తర్వాత తాను స్పృహ కోల్పోయేలా చేశాడని తెలిపింది. సదరు వ్యక్తి తన ఫొటోలు తీశాడని, ఈ విషయం బయటకు చెబితే సామాజిక మాధ్యమాలలో పోస్టు చేస్తానని బెదిరించాడని ఆమె పోలీసులకు వివరించింది. తన ఆరోపణలకు మద్దతుగా కొన్ని సాక్ష్యాలను కూడా సమర్పించింది. అయితే, పోలీసులు లోతుగా విచారణ జరిపిన తర్వాత ఆ మహిళా టెక్కీ అబద్ధపు ఫిర్యాదు చేసిందని తేలింది. డెలివరీ ఏజెంట్‌గా వచ్చిన వ్యక్తి ఆమె స్నేహితుడని గుర్తించారు. ఆమెపై ఎలాంటి అఘాయిత్యం జరగలేదని, కావాలనే పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిందని విచారణలో వెల్లడైంది. దీంతో పోలీసులు ఆమె పైనే కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటామని పోలీసు అధికారులు తెలిపారు.

## సూపర్ సిక్స్‌లో అన్నీ అమలు చేశాం

**మహిళలకు 1500 పథకం ఇవ్వాల్సి ఉంది**

**వ్యవసాయమంత్రి అచ్చన్నాయుడు**

**శ్రీకాకుళం,జులై 22(కొత్తస్వరం):**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. సూపర్ సిక్స్ సహా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని ప్రతిపక్షం వైసీపీ ఆరోపిస్తోంది. ఈ విషయంలో సమయం చూసి మరీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. ఇలాంటి తరుణంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాత్రం అన్నీ అమలు చేశామని వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో ఓ పథకంను అమలు చేయడానికి ఆంధ్రానే అమ్మేయాలి అని అన్నారు. కొత్తవలస మంగళపాలెంలో టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొని ఘాటు- వ్యాఖ్యలు చేశారు. 'సూపర్ సిక్స్ అన్నీ ఇచ్చేశాం. కేవలం మహిళలకు రూ.1500 రూపాయలు ఒక్కటే ఇవ్వాల్సి ఉంది. ఈ పథకం ఇవ్వాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాల్సిందే. అందుకు ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆధాయం కేవలం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకే రావడం లేదు. ఈ నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోంది. కానీ జిల్లాకే పరిమితం చేస్తామన్నారు. నారా లోకేష్ గారితో మాట్లాడాను. రాష్ట్ర వ్యాప్తంగా ఇవ్వాలని లోకేష్ బాబు చెప్పారు. ఆరు బస్సులలో రాష్ట్రమంతా ప్రయానించొచ్చు. ఆటో డ్రైవర్‌లు వచ్చి తమకు సాయం చేయాలని కోరారు. వాళ్లనీ మేం ఆదుకుంటాము' అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## హోంగార్డులకు జీతాలుచెల్లించండి

**ప్రభుత్వానికి హరీష్ రావు డిమాండ్**

**హైదరాబాద్,జులై 22(కొత్తస్వరం):**

పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. మాటల్లో ఫేకుడు, ఢిల్లీకి వెళ్లి జోకుడు ఇదేనా సిఎం రేవంత్ రెడ్డికి తెలిసిందని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు విమర్శించారు. నెల మొదలై 22 రోజులు గడస్తున్నా హోంగార్డులకు జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటుని మండిపడ్డారు. హోంగార్డులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిఎం రేవంత్ రెడ్డి.. రాష్ట్రంలోని హోంగార్డు సోదరుల ఆవేదన వినాలని సూచించారు. భద్రాది కొత్తగూడెం, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, జగిత్యాల, వరంగల్, రామగుండం, వికారాబాద్ జిల్లాల్లో పని చేస్తున్నవారికి జీతాలు రాలేదని చెప్పారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హోంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితి నెలకొందని, ఇఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరని ఆరోపించారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. వీరికి ఏం సమాధానం చెబుతారు..? అని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మంత్రిగా ఉన్న హోంశాఖలోనే ఇలాంటి దుర్భర పరిస్థితులా..? అని అడిగారు. వెంటనే హోంగార్డులకు వేతనాలు చెల్లించాలని, ప్రతి నెలా సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో మామిడి రైతులకు ఊరట

**కిలోకి రూ.4 అదనంగా ఇచ్చే విధంగా రూ.260 కోట్లు కేటాయింపు**

**కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి**

**న్యూఢిల్లీ,జులై 22(కొత్తస్వరం):**

తోతాపురి మామిడి రైతులకు ఉపశమనం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని కిలోకి రూ.4 అదనంగా ఇచ్చే విధంగా రూ.260 కోట్లు- కేటాయించి రైతులకు న్యాయం చేశారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా 50 శాతం కేంద్రం, మిగిలిన 50శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే విధంగా నిర్ణయం తీసుకోవాలని కేంద్రాన్ని కోరారు. దిల్లీలో ఏర్పాటు- చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తోతాపురి మామిడి ధర పడిపోవడంతో ఈమేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు విజ్ఞప్తి చేయడంతో వారు స్పందించారు. దీంతో మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్‌ను తోతాపురి మామిడికి కూడా వర్తించే విధంగా నిబంధనలు సడలించారు. ఈ స్కీమ్ ద్వారా రూ.130 కోట్లు- కేంద్రం మంజూరుకు ఇవాళ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భవిష్యత్‌లో తోతాపురి మామిడి ధర పడిపోయినప్పుడు మార్కెట్ ఇంర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులను ఆదుకునేందుకు అవకాశముంటుంది. సీఎం, డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్, ఏపీ వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు.. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే విధంగా కృషి చేశారని పెమ్మసాని తెలిపారు.

## రాష్ట్రపతి ముర్ముతో డిప్యూటీ చైర్మన్ హరివంశ్ భేటీ

రాజీనామా చేసి అందరికీ షాక్ ఇచ్చారు. మంగళవారం రాజ్యసభలో ఉదయం హరివంశ్ సభకు అధ్యక్షత వహించారు. అయితే, విపక్షాల ఆందోళనలతో ప్రారంభమైన కొద్దిసేపటికే రాజ్యసభ కార్యకలాపాలు బుధవారానికి వాయిదాపడ్డాయి. ఉపరాష్ట్రపతి రాజీనామా కారణంగా రాజ్యసభ చైర్మన్ పదవి సైతం ఆటోమేటిక్‌గా ఖాళీ అయ్యింది. ఉపరాష్ట్రపతి ఎగువ సభకు ఎక్స్-అఫిషియో చైర్మన్. ఈ పరిస్థితుల్లో ఆయన రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం తెలుపడంతో వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలు మొత్తం డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ చూసుకోనున్నారు. పార్లమెంట్ సమావేశాల తొలిరోజున జగదీప్ ధన్‌ఖర్ చురుగ్గానే కనిపించారు. ఉదయం సభలో సానుకూలంగా చర్చలు జరపాలని ఆయన సభ్యులకు సూచించారు. జస్టిస్ యశ్వంత్ వర్మపై అభిశంసన తీర్మాన నోటీసును అంగీకరించిన ఆయన.. పక్రియను వివరించారు. జస్టిస్ శేఖర్ యాదవ్‌పై సమర్పించిన అభిశంసన నోటీసులో ఒక ఎంపీ డబుల్ సంతకంపై విచారణను చేయనున్నట్లు- తెలిపారు. అయితే, ఆరోగ్య కారణాలు పేర్కొంటు- ఆయన తక్షణం అమలులోకి వచ్చేలా ఆయన పదవికి రాజీనామా చేశారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపిన రాజీనామా లేఖలో వైద్యుల సూచన మేరకు ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యం ఇచ్చేందుకు రాజీనామా చేస్తున్నట్లు- ఆయన వెల్లడించారు.ఆయన మార్చిలో ఎయిమ్స్‌లో చేరారు. ఆ తర్వాత వైద్యులు ఆయనను ఢిల్లీ వెలుపలకు వెళ్లకుండా ఉండాలని సూచించారు. జూన్‌లో ఉత్తరాఖండ్‌లోని కుమావున్ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన వేదికపైనే స్పృహ కోల్పోయారు. ఆ రోజు వేడి పరిస్థితులు ఉన్నట్లుగా అధికారులు తెలిపారు. ఈ నెల ప్రారంభంలో ఆయన కేరళలో పర్యటించారు. ఈ సమయంలో ఆరోగ్యం క్షీణించగా.. భార్య ఆయనకు అండగా ఉన్నారు. జులై 17న ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో స్వల్పంగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన భార్య మంచినీళ్లు తీసుకువచ్చి ఇవ్వగా పరిస్థితి మెరుగైంది. ఈ క్రమంలోనే ఆయన ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని వైద్యుల సూచనల మేరకు కీలక బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు- తెలుస్తున్నది.

## పూర్తికాలం పదవిలో కొనసాగుతానని వెల్లడి

**అంతలోనే రాజీనామా చేయడంపై అనుమానాలు**

**న్యూఢిల్లీ,జూలై22(కొత్తస్వరంఎ):**

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో దేశ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి రాజీనామా చేయడంతో ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. పది రోజుల క్రితమే ఓ కార్యక్రమంలో పాల్గొన్న ధన్‌ఖర్ ప్రస్తుతం పూర్తికాలం ఉప రాష్ట్రపతి పదవిలో కొనసాగుతానని స్పష్టం చేశారు. జులై 10న జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రసంగిస్తూ.. 'నేను ఆగస్టు 2027లో సరైన సమయంలో దైవ నిర్ణయానికి లోబడి పదవీ విరమణ చేస్తాను' అని స్పష్టం చేశారు. ఆయన 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే, పది రోజుల క్రితం పూర్తి కాలం ఈ పదవిలో కొనసాగుతానని చెప్పిన ఆయన.. ఇప్పుడు అనూహ్యంగా రాజీనామా చేయడం ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు. విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు- గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు.ది.రైతు బిడ్డగా పేరుగాంచిన ధన్‌ఖఢ్ రైతు సమస్యల విషయంలో మోదీ ప్రభుత్వ తీరును పలుసార్లు తప్పుపట్టారు. అంతర్జాతీయంగా భారత్ వెలిగిపోతుంటే మరి దేశంలో రైతులు ఎందుకు సంక్షోభంలో ఉన్నారని ఆయన ఓ సందర్భంలో కేంద్రాన్ని ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని కూడా మోదీ సర్కారును ఆయన బహిరంగంగానే నిలదీశారు. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ధన్‌ఖఢ్ 1951 మే 18న రాజస్థాన్‌లోని జుంజ్‌జునూ జిల్లాలోని కిథానా గ్రామంలో జన్మించారు. గతంలో కాంగ్రెస్, జనతాదళ్‌లో ఉన్న ధన్‌ఖఢ్ 2003లో బీజేపీలో చేరారు. ఉపరాష్ట్రపతిగా ఆయన ప్రతిపక్ష పార్టీలతో తీవ్రంగా విభేదించారు. 2019 నుంచి 2022 వరకు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా పనిచేసిన ధన్‌ఖఢ్ మమతా బెనర్జీ ప్రభుత్వంతో పూర్తి స్థాయిలో ఘర్షణ వాతావరణాన్ని ఎదుర్కొన్నారు. తరచూ ప్రభుత్వంతో విభేదాలతో వార్తల్లో నిలిచారు. ధన్‌ఖఢ్ వైఖరిని మమతాబెనర్జీ తీవ్రంగా ఆక్షేపించారు.

## ధన్‌ఖర్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

**జగ్‌దీప్ ఆయురారోగ్యాలతో ఉండాలని మోదీ ఆకాంక్ష**

**న్యూఢిల్లీ,జూలై22(కొత్తస్వరంఎ):**

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సమర్పించగా.. మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దానికి ఆమోదం తెలిపారు. ఈ సమాచారాన్ని రాష్ట్రపతి కార్యాలయం హోంమంత్రిత్వ శాఖకు తెలియజేసింది. అలాగే దీనికి సంబంధించి త్వరలో నోటిఫికేషన్ జారీ కానుంది. అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా చేస్తున్నాట్లుగా ప్రకటించారు. అయితే ఆయన రాజీనామాపై ఎలాంటి అనుమానాలు ప్రభుత్వం పక్షాన వ్యక్తం కాలేదు. సరికదా ఆయన ఆయురారోగ్యా లతో ఉండాలని కోరుకుంటున్నానని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. ఉప రాష్ట్రపతి పదవితో సహా వివిధ హోదాల్లో ధన్‌ఖడ్ దేశానికి సేవలు అందించారని అన్నారు. రాజ్యసభ చైర్మన్ హోదాలో పార్లమెంటు- వర్షాకాల సమావేశాల తొలిరోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖడ్.. రాత్రి కల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు- అందులో పేర్కొన్నారు. వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ)కు అనుగుణంగా నేను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నా. బాధ్యతల నిర్వహణలో నాకు అండగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు. పదవీకాలంలో మేం చాలా ప్రశాంతమైన, అద్భుతమైన వర్కింగ్ రిలేషన్‌ను కొనసాగించాం. ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక కృతజ్ఞతలు అని ధన్యవాదాలు చెప్పారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే ఆయన వైదొలగాలని నిర్ణయించుకున్నారు. దేశ 14వ ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన సోమవారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా కనిపించినప్పటికీ రాత్రికి అదే కారణంతో రాజీనామా చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ధన్‌ఖడ్ రాజీనామా ఊహించని పరిణామమని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ఆరోగ్య అంశం కంటికి కనిపిస్తున్నా కనిపించనివి ఏవో దీనివెనక ఉండి ఉంటాయని అనుమానం వ్యక్తంచేసింది.

## ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ చర్చ

**అనూహ్య రాజీనామాకు కారణాలపై ఆరా**

**లోతైన కారణాలు ఉంటాయని జైరామ్ రమేశ్ అనుమానం**

**న్యూఢిల్లీ,జూలై22(కొత్తస్వరంఎ):**

ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాపై రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఎవరికి తోచిన విధంగా వారు విశ్లేషణలు చేస్తున్నారు. ఇంత సడన్‌గా ఎందుకు రాజీనామా నిర్ణయం తీసుకున్నారని ఆరా తీస్తున్నారు. ధన్‌ఖడ్ అనూహ్య రాజీనామాపై ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. అనారోగ్య కారణాలతో వైదొలుగుతున్నట్లు ఆయన చెప్పినప్పటికీ.. అది కారణం కాకపోవచ్చని ఆ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. 'ధన్‌ఖడ్ సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు బిజినెస్ అడ్వైజరీ కమిటీకి అధ్యక్షత వహించారు. భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్రమంత్రి కిరణ్ రిజిజుతో సహా పలువురు దీనికి హాజరయ్యారు. చర్చ అనంతరం సాయంత్రం 4.30కు మళ్లీ సమావేశం కావాలని నిర్ణయించుకున్నారు. అయితే, మరోసారి భేటీకి రిజిజు, నడ్డా రాలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తంచేసిన ధన్‌ఖఢ్ మంగళవారం మధ్యాహ్నానికి వాయిదా వేశారు. దీన్ని బట్టి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 4.30 మధ్య ఏదో పెద్ద విషయమే జరిగిందని జైరామ్ రమేశ్ అనుమానం వ్యక్తం చేశారు. రిజిజు, నడ్డా ఉద్దేశపూర్వకంగానే సమావేశానికి గైర్హాజరయ్యారు. ఈక్రమంలోనే ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ధన్‌ఖఢ్ ప్రకటించారు. ఆరోగ్య కారణాల దృష్ట్యా ఇలా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దాన్ని మనం గౌరవించాలి. కానీ, అందుకు చాలా లోతైన కారణాలు ఉన్నట్లు తెలుస్తోందని రమేశ్ రాసుకొచ్చారు. తన పదవీకాలంలో రైతుల సంక్షేమంపై ధన్‌ఖఢ్ నిర్భయంగా మాట్లాడేవారని రమేశ్ పేర్కొన్నారు. ప్రజాజీవితంలో న్యాయపరమైన జవాబుదారీతనం, సంయమనం గురించి గట్టిగా మాట్లాడారన్నారు. ఆయన నిబంధనలు, ప్రొటోకాల్‌కు కట్టుబడి ఉన్నారన్నారు. సోమవారం పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైన సంగతి తెలిసిందే. తొలి రోజు కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ధన్‌ఖఢ్ రాత్రి అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్లే తాను పదవి నుంచి వైదొలుగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. ఈ క్రమంలోనే ఆయన వైదొలగాలని నిర్ణయించుకోవడం అనుమానాలను కలిగిస్తోంది. ధన్‌ఖఢ్ రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ- చైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు. ఉదయం నుంచి ఎగువసభను సజావుగా నడిపించిన ఆయన రాత్రికి తన రాజీనామా లేఖను రాష్ట్రపతి ముర్ముకు పంపారు. దీంతో ఆయన రాజీనామాపై ప్రస్తుతం తీవ్రంగా చర్చ నడుస్తోంది. అనారోగ్య కారణాలతో పదవి నుంచి దిగిపోతున్నట్లు- ధన్‌ఖడ్ చెప్పినప్పటికీ.. ఆయన రాజీనామాపై ప్రతిపక్ష పార్టీలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆరోగ్య కారణాలతోనే పదవి నుంచి దిగిపోతున్నట్లు- చెప్పారని.. దాన్ని మనం గౌరవించాలని జైరాం రమేష్ వ్యాఖ్యానించారు. ఏది ఏమైనా ఆయన రాజీనామా వెనుక ఏదో లోతైన కారణమే ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

## సంపాదకీయం

# శేషప్రశ్నగా ధన్‌ఖడ్ రాజీనామా వ్యవహారం !

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే..అనూహ్యంగా భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్ రాజీనామా చేయడం సహజంగానే ఆశ్చర్యాన్ని కలిగించడమే కాకుండా...అనుమానాలను రేకెత్తించింది. బెంగాల్ గవర్నర్‌గా ఆయన పనితీరును ప్రశంసించిన మోడీ అనూహ్యంగా ఆయనను ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేశారు. వెంకయ్యనాయుడు పదవీకాలం ముగియగానే పొడిగించమో లేదా..రాష్ట్రపతిగా ప్రమోషన్ ఇవ్వడమో జరుగుతుందని అంతా అనుకున్నారు. అయితే అవేవీ జరగలేదు. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత అన్నీ అనూహ్యాలే జరుగుతున్నాయి. అద్వానీని రాష్ట్రపతిని చేస్తారని అంతా భావించారు. బిజెపి శ్రేణులు గట్టిగా నమ్మారు. కానీ రామ్‌నాథ్ కోవింద్‌ను తెరపైకి తెచ్చి అద్వానీని అవమానించారు. ఈ దేశానికి ప్రధాని కావాలని గట్టిగా నమ్మి పార్టీ కోసం కృషి చేసిన అద్వానీకి మోడీ అడ్డుపడ్డాడు. ఆతరవాత రాష్ట్రపతిని చేస్తారని అనుకుంటే...అప్పుడు కోవింద్ తెరపైకి వచ్చారు. ఇక అద్వానీ శకం ముగిసింది. మురళీమనోహర్ జోషి శకం ముగిసింది. పాతతరంలో రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీలు మాత్రమే ఇప్పుడు మోడీ ప్రభుత్వంలో ఉన్నారు. వెంకయ్యనాయుడును పార్టీ నుంచి తప్పించే క్రమంలో ఉపరాష్ట్రపతిని చేసి, ఆ తరవాత ఆయనను ఇంటికే పరిమితం చేశారు. ఇప్పుడు ధన్‌ఖడ్ రాజీనామా కూడా అనూహ్యమే అయినా మోడీ వ్యూహం ఉండేవుంటుంది. పార్లమెంటు ప్రారంభంకావడం, తొలిరోజే అనూహ్యంగా విపక్షాలు వివిధ అంశాలపై చర్చకు పట్టుబట్టడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎందుకు రాజీనామా చేశారన్న ప్రశ్న ఉదయిస్తోంది. అయితే రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజీనామాను ఆమోదించారు. ఈ మేరకు ఫైల్‌పై సంతకం చేశారు. కాగా, గత రాత్రి అనూహ్యంగా జగదీప్ ధన్‌ఖర్ తన పదవికి రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో పదవి నుంచి వైదొలుగుతున్నట్లు పేర్కొన్నారు. కానీ, ఈ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం కాదని పలువురు రాజకీయ నేతలు అంటున్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల వేళ ఉప రాష్ట్రపతి అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేయడంఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఉపరాష్ట్రపతి రాజీనామాపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తొలిసారి స్పందించారు. ఉపరాష్ట్రపతి సహా వివిధ హోదాల్లో దేశానికి సేవ చేసేందుకు ధన్‌ఖడ్‌కు అనేక అవకాశాలు లభించాయ న్నారు. ఆయన మంచి ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటున్నట్లు– పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 67(ఏ) అధికరణ కింద ఇది తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు. ఈ మేరకు ఉపరాష్ట్రపతి కార్యాలయం ఈ లేఖను విడుదల చేసింది. తన బాధ్యతలను నిర్వర్తించడంలో పూర్తి సహకారాన్ని అందచేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు, ప్రధాని నరేంద్ర మోదీకి, కేంద్ర మంత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే మరో రెండేండ్లు పదవీకాలం ఉండగానే ధన్‌ఖడ్ రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎందుకిలా అన్న చర్చ సాగుతోంది. 2022లో ఎన్డీయే తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా నామినేట్ కావడంతో ఆయన బెంగాల్ గవర్నర్ పదవికి రాజీనామా చేశారు.విపక్ష అభ్యర్థి మార్గరేట్ అల్వాపై విజయం సాధించి ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. 710 ఓట్లకుగాను 528 ఓట్లు గెలుచుకుని 1997 తర్వాత అత్యధిక ఓట్లతో ఉపరాష్ట్రపతిగా విజయం సాధించిన వ్యక్తిగా రికార్డు సృష్టించారు. ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన మూడో వ్యక్తి ధన్‌ఖడ్. అంతకుముందు 1969లో రాష్ట్రపతి పదవికి పోటీ చేసేందుకు వీవీ గిరి, 1987లో రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో ఆర్ వెంకటరామన్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేశారు. కానీ అలాంటిదేమీ లేకుండానే ధన్‌ఖఢ్ రాజీనామా చేయడం ఢిల్లీ రాజకీయాలలో ఆసక్తికరంగా మారింది. ఓ న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభించడం, కేంద్ర ప్రభుత్వంతో వివాదం, రాజ్యసభలో జరిగిన కొన్ని సంఘటనలు దన్‌కడ్ రాజీనామా వెనక ఉన్నాయని చెబుతున్నారు. ఈ నిర్ణయం ప్రస్తుతం దేశ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జస్టిస్ యశ్వంత్ వర్మ అనే న్యాయమూర్తి నివాసంలో భారీగా నగదు లభ్యం కావడంతో ఈ వివాదం మొదలైంది. ఈ సంఘటన తర్వాత విపక్ష పార్టీలు రాజ్యసభలో జస్టిస్ వర్మను తొలగించేందుకు ఒక నోటీసును ప్రవేశపెట్టాయి. రాజ్యసభ అధ్యక్షుడిగా ఉన్న జగదీప్ ధన్‌ఖర్ ఈ నోటీసును ఆమోదించి, రాజ్యసభ కార్యదర్శికి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వానికి నచ్చలేదని తెలుస్తోంది. విపక్షాలు ప్రవేశపెట్టిన ఈ నోటీసును ఆమోదించడం ద్వారా, న్యాయవ్యవస్థలో అవినీతిపై కేంద్రం నేరుగా చర్యలు తీసుకునే అవకాశాన్ని ధన్‌ఖర్ తప్పించారని కేంద్రం భావించినట్లు సమాచారం. ఈ విషయంపై కేంద్రంతో విభేదాలు వచ్చాయని పుకార్లు కూడా వచ్చాయి. ఈ సంఘటన తర్వాత ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చే ప్రయత్నాలు మొదల య్యాయని తెలిసింది. ఆరు నెలల క్రితం కూడా విపక్షాలు ధన్‌ఖర్‌పై అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. అయితే, ఈసారి కేంద్రం నుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా, ధన్‌ఖర్ అవమానకరమైన అవిశ్వాస తీర్మానానికి బదులు రాజీనామా చేయడాన్ని ఎంచుకున్నారని తెలుస్తోంది. ఈ క్రమంలో జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని సోమవారం రాత్రి 9:25 గంటలకు ఉప రాష్ట్రపతి అధికారిక ఎక్స్ ఖాతాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖను పోస్ట్ చేశారు. తన ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడానికి, భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఎ) ప్రకారం రాజీనామా చేస్తున్నట్లు– లేఖలో తెలిపారు. ఇది వెంటనే అమల్లోకి వచ్చేలా భారత ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. ఈ క్రమంలో తన పదవీ కాలంలో సహకరించిన వారికి ధన్‌ఖడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే, ప్రధానమంత్రి, రాజ్యసభ సభ్యులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఇవన్నీ బయటకు కనిపిస్తున్న కారణాలే అయినా ఇంకా ఇతరత్రా ఏ కారణాలు ఉన్నాయన్నది కాలక్రమంలో తెలుస్తుంది. అయితే ధన్‌ఖడ్ మోడీకి ఇష్టమైన వ్యక్తిగా అనూహ్యంగా దూసుకుని వచ్చి..అంతే అనూహ్యంగా రాజీనామా చేసి వెళ్లిపోవడమనే చర్చ మాత్రం అనుమానాలను రేకెత్తిస్తూనే ఉంటుంది.

## స్కూల్స్ ఫర్ రైజింగ్‌లో ఎన్టీఆర్ జిల్లాకు అన్యాయం

**మరిన్ని పాఠశాలలను ఎంపికచేయాలన్న ఎంపి కేశినేని**

**న్యూఢిల్లీ,జులై 22(కొత్తస్వరం):**

కేందప్రభుత్వం ప్రారంభించిన ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పథకం కింద ఎన్టీఆర్ జిల్లాకి పాఠశాలల కేటాయింపు చాలా తక్కువగా ఉన్న అంశాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ లోక్‌సభలో మంగళవారం ప్రస్తావించారు. రూల్ నెంబర్ 377 కింద ఎన్టీఆర్ జిల్లాకు పీఎం–శ్రీ పాఠశాలల కేటాయింపుపై పున: సమీక్షించి, మరిన్ని పాఠశాలల మంజూరు చేయాలనే అంశాన్ని ఎంపీ కేశినేని శివనాథ్ లేవనెత్తారు. పాఠశాలల ఎంపికలో ఎన్టీఆర్ జిల్లాకు తక్కువ ప్రాతినిథ్యం దక్కిందని ఎంపీ కేశినేని శివనాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దశల్లో జిల్లాలో మొత్తం 827 పాఠశాలలను బెంచ్‌మార్క్ చేసినప్పటికీ, వాటిలో 550 పాఠశాలలు అర్హత ప్రమాణాలను చేరుకున్నప్పటికీ, కేవలం 27 పాఠశాలలకే ఆమోదం లభించిందని తెలిపారు. ఈ ఎంపిక శాతం కేవలం 4.9 శాతంగా ఉండటం ఏపీలోనే అత్యల్పమని చెప్పుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం మొత్తం 62 పాఠశాలలను కేందప్రభుత్వానికి సిఫారసు చేసినప్పటికీ, వాటిలో 56శాతం పైగా పాఠశాలలు తుది ఎంపికలోకి రాకపోవడం బాధకరమని అన్నారు. జిల్లాలో జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలలు నడుస్తున్నాయనీ, విద్యా మౌలిక వసతులు సిద్ధంగా ఉన్నాయని గుర్తుచేస్తూ, ఎంపిక పక్రియను పున:సమీక్షించాలని, మరిన్ని పాఠశాలలను ఎన్టీఆర్ జిల్లాకు మంజూరు చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అభివృద్ధి సంక్షేమ పథకాలు పేదలకు చేరేలా కలెక్టర్లు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి








**వివిధ జిల్లా కలెక్టర్లకు మంత్రులు వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశం**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, జులై 22, కొత్త స్వరం ప్రతినిధి :-**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పలు అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో జిల్లా కలెక్టర్లు కీలకంగా వ్యవహరించాలని, ఆయా సంక్షేమ ఫలాలు పేద ప్రజలకు చేరే విధంగా తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రులు శ్రీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, శ్రీ పొన్నం ప్రభాకర్, శ్రీమతి కొండా సురేఖ, శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం ఉదయం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు, వివిధ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, విభాగాధిపతులతో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, భూభారతి, వివిధ రెసిడెన్షియల్ స్కూళ్లలో భోజన, మౌలిక వసతుల ఏర్పాటు, వనమహోత్సవంలో మొక్కలు నాటడడం, మహాలక్ష్మి పథకం తదితర అంశాలపై సమీక్ష చేశారు. రాష్ట్ర మంత్రులు వివిధ అంశాల వారీగా జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ లక్ష్యాల మేరకు కలెక్టర్లు, అధికారులు నిర్విరామంగా కృషి చేయాలనితెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాపాలనలో గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ఈ ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టిందని, క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని, పేద ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ఎన్నో పథకాల ఫలితాలను వారికి అందే విధంగా తగు చర్యలు తీసుకోవాలని, దానికగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని మంత్రులు స్పష్టం చేశారు.సంక్షేమ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం సరఫరా ముఖ్యమంత్రిఆదేశాలకనుగుణంగా సాంఘిక, బిసి, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, హాస్టళ్లలో నిర్వాహణపై ఎప్పుటికప్పుడు తనిఖీలు నిర్వహించి వారంలో ఒక్కరోజు అధికారులందరూ ఆ హాస్టళ్లలో బస చేయాలని కలెక్టర్లను మంత్రులు ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లకు వీటి నిర్వాహణపై పలు సూచనలు చేశారు. పెంచిన డైట్ ఛార్జీలకు అనుగుణంగా నాణ్యమైన భోజన వసతి కల్పించాలని ఆదేశించారు. హాస్టళ్లలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక వసతులు కల్పిం చాలని, వారి నుంచి ఎలాంటి ఫిర్యాదులు రావొద్దని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రులు శ్రీ పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమారులు జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు చేశారు. హాస్టళ్ల ప్రాంగణాల్లో పచ్చదనం పరిశుభ్రతల్లో భాగంగా శానిటేషన్‌ను చేపట్టాలని, అన్ని జిల్లాల్లో ఎగ్ టెండర్స్ ప్రక్రియను త్వరలో పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో నెలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా రేపటికి 200 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని, ఈ సందర్భంగా 97 బస్సు డిపోలు, 321 బస్‌స్టేషన్లలో వేడుకలను నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ లక్ష్యాల మేరకు అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణంలో ఇసుక కొరత లేకుండా కలెక్టర్లు తగు చర్యలు తీసుకోవాలని, ఇసుక రవాణాలో లబ్ధిదారుడినికి ఉచితంగా అందజే యాలని, ఇసుక రవాణా విషయంలో లబ్ధిదారునికి ఎలాంటి భారం కలుగకుండా చూడాలని కలెక్టర్లను మంత్రి ఆదేశించారు. ప్రతి వారం దీనిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రగతిని సమీక్షిస్తానని మంత్రి తెలిపారు. భూభారతిలో నమోద్కైన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో విరివిగా మొక్కలు నాటాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుండి జిల్లా కలెక్టరు మను చౌదరి, అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధన్‌ఖడ్ స్థానంలో ఎవరన్న చర్చ

**రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్‌పై దృష్టి**

**బీహార్ ఎన్నికల నేపథ్యంలో కలసివచ్చే ఛాన్స్**

**న్యూఢిల్లీ,జూలై22(కొత్తస్వరంఎ):**

ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి రాజీనామా చేశారు. మరో రెండేండ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ ఆయన కుర్చీని ఖాళీచేశారు. ఆరోగ్య కారణాలను పేర్కొంటూ రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపించారు. ఈనేపథ్యంలో తదుపరి ఉపరాష్ట్రపతి ఎవరనే అంశంపై విస్తృతంగా చర్చ జరుగుతున్నది. అధికార పార్టీ పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్లు– తెలుస్తున్నది. బీజేపీతోపాటు– ఎన్డీయే పక్షాలకు చెందిన నేతనూ ఈ పదవి దక్కనుందని సమాచారం. ఈ నేపథ్యంలో జనతాదళ్ (యునై–టెడ్) ఎంపీ, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. త్వరలో బీహార్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అదే రాష్ట్రానికి చెందిన హరివంశ్‌ను ఇందుకు ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. రాజకీయంగా అ అవకాశాన్ని మోడీ ఉపయోగించుకునే తీరుతారని అంటున్నారు. బీహార్‌కు చెందిన హరివంశ్‌కు రాజకీయాలలో అనుభవజ్ఞునిగా పేరున్నది. ఉన్నత విద్యావంతుడిగా పేరుపొందారు. ఆయన తొలిసారి 2014లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఆర్థికశాస్త్రంలో పీజీ చేసియన ఆయన జర్నలిజ్యంలో డిప్లొమా అందుకున్నారు. రాజకీయాల్లోకి రాకముందు చాలా ఏండ్లు జర్నలిస్టుగా పనిచేశారు. ప్రభుత్వ బ్యాంకులో ఉద్యోగం వచ్చినప్పటికీ జర్నలిజంపై మక్కువతో 'ధర్మయుగ్'లో సబ్ ఎడిటర్‌గా కెరీర్ ప్రారంభించారు. రవివర్, ప్రభాత్ ఖబర్ వంటి ప్రముఖ ప్రింట్ మీడియా సంస్థల్లో పనిచేశారు. ప్రభాత్ ఖబర్‌కు చీఫ్ ఎడిటర్‌గానూ వ్యవహరించారు. మాజీ ప్రధాని చంద్రశేఖర్‌కు సలహాదారుగా పనిచేసిన ఆయన.. ఆ ప్రభుత్వం కూలిపోవడంతో మళ్లీ జర్నలిజంలోకి వచ్చేశారు. నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ) నుంచి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2020 నుంచి రాజ్యసభ డిప్యూటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. త్వరలో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు కూడా ఉండనుండటంతో హరివంశ్‌నే ఉపరాష్ట్రపతిగా ఎన్డీయే ప్రభుత్వం నియమించే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

## రేడియో శ్రోతలకు గుర్తుండిపోయే చిత్తరంజన్

**విజయవాడ,జూలై22(కొత్తస్వరంఎ):**

తన సలలిత రాగ సుధారసంతో ఓ తరాన్ని మైమరిపించిన స్వరనిధి డా. మహాభాష్యం చిత్తరంజన్. ఆయన మరణించి రెండేళ్లు అవుతోంది. అయితే పాతతరం వారికి ముఖ్యంగా రేడియో విన్న వారికి చిత్తరంజన్ చిరపరిచితుడు. ఓ రకంగా రేడియోకు ప్రాముఖ్యం తగ్గడంతో పాటు అలాంటి వారంతా వెళ్లిపోడం వెలితిగా అనిపించింది. రేడియో వింటూ అదే మహదానందంగా మురిసి పోయిన నిన్నటి తరానికి – సరళమైన, మధురమైన లలిత సంగీతపు రుచి చూపించిన స్వరమాంత్రికుడు చిత్తరంజన్. చిత్తరంజన్ రెండేళ్ల క్రితం జూలై 21న పరపదించారు. కూర్చోలేని పరిస్థితిలో కూడా ఆయన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఎనిమిదేళ్ల ప్రాయంనుంచే అప్పటి నిజాం ఆధీనంలోని దక్కన్ రేడియోలో పాడటంనుంచి, బాలమురళీకృష్ణగారి శిష్యరికంలో ఆయనతో కచేరీల్లో పాల్గొన్న రోజుల్నుంచి, రేడియోలో చేరి తేటతేట తెలుగు పదాల సుమధుర లలిత సంగీత బాణీలతో ఆబాలగోపాలాన్ని మైమర పించిన రోజులనుండి, ఎందరెందరికో గాయనీగాయకులుగా మరోజన్మ ఇచ్చిన మహానుభావుడాయన. సంగీత కుటుంబంలో జన్మించి, లలిత సంగీతాన్నే ఊపిరిగా చేసుకొని ఇక తన గాత్ర మాధుర్యాన్ని అందించారు. నేటి విపరీత పోకడల సంగీతపు హోరులో వారి పంచిన స్వర రుచి ఎంతకమ్మనో ఈ తరానికి తెలియకపోవచ్చు. కాని ఆయన ఎన్నో ఆపాత మధురమైన బాణీలు రేడియో రోజులనాటి తరానికి సాక్షులమైన వారి చెవులలో ఇప్పటికీ గింగురుమంటాయి.

# విడాకుల కేసులో ఆసక్తికర పరిణామం

**భర్త ఆదాయానికి మించి భరణం కోరడంపై సిజె అభ్యంతరం**

**న్యూఢిల్లీ,జులై 22(కొత్తస్వరం) :**

సుప్రీంకోర్టులో ఓ విడాకుల కేసులో భరణం చెల్లించే విషయంలో మంగళవారం ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. విడాకుల నేపథ్యంలో భర్త నుంచి భరణాన్ని మహిళ కోరడంతో.. భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భర్త నుంచి విడాకులు తీసుకునే క్రమంలో తనకు ముంబైలో ఇల్లు, రూ. 12 కోట్ల నగదుతోపాటు బీఎండబ్ల్యూ కారు భరణంగా ఇప్పించాలంటూ తన పిటిషన్‌లో ఆమె కోరింది. ఈ పిటిషన్ సీజేఐ బీఆర్ గవాయి ముందుకు వచ్చింది. దీనిని ఆయన పరిశీలించి.. కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆమెతో సీజేఐ బీఆర్ గవాయి మాట్లాడుతూ.. మీరు బాగా చదువుకున్నారు. ఎంబీఏ కూడా చేశారు. ఐటీ– ఉద్యోగం సైతం చేస్తున్నారని.. మీరు బెంగళూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో మీకు మంచి డిమాండ్ ఉందన్నారు. మీరు అక్కడ ఎందుకు ఉద్యోగం చేయకూడదంటూ ఆమెను సూటిగా ప్రశ్నించారు. మీరు కోరుతున్న ఇల్లు కల్పతరువులో ఉందన్నారు. అది కూడా బిల్డర్ చేతిలో ఉందని గుర్తు చేశారు. అదీకాక మీ వివాహమై కేవలం 18 నెలలు మాత్రమే అయిందన్నారు. ఆ క్రమంలో మీరు నెలకు కోటి రూపాయిల నగదు అడుగుతున్నట్లుగా ఉందని పేర్కొన్నారు. సీజేఐ వ్యాఖ్యలపై ఆ మహిళ స్పందిస్తూ.. విడాకులు కోరుతున్న తన భర్త బాగా ధనవంతుడని చెప్పింది. తనకు స్కిజోఫ్రెనియా ఉందని.. అందుకే విడాకులు ఇస్తున్నట్లు అతడు స్పష్టం చేశారన్నారు. అయితే తనకు స్కిజోఫ్రెనియా ఉన్నట్లు– కనిపిస్తుందా? అంటూ సీజేఐను ఈ సందర్భంగా ఆమె ప్రశ్నించింది. ఇంతలో భర్త తరఫు న్యాయవాది మాధవి దివాన్ జోక్యం చేసుకున్నారు. ఆమె ఉద్యోగం చేస్తుందన్నారు. ఇలా ప్రతి దానిని డిమాండ్ చేయడం సరికాదని వ్యాఖ్యానించారు. ఆ క్రమంలో సీజేఐ బీఆర్ గవాయి స్పందిస్తూ.. విడాకుల కోసం పిటిషన్ దాఖలు చేసిన నీ భర్త ఆస్తి.. అతడి తండ్రిదని స్పష్టం చేశారు. ఇక ఆ యువతి అందుకు సమాధానమిస్తూ.. తన భర్త బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తూనే మరోవైపు రెండు వ్యాపారాలు చేస్తున్నారని చెప్పారు. తనకు కుమారుడు ఉన్నాడని.. అతడిని తనకు ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. కానీ తనకు స్క్రిజోఫ్రెనియా ఉందన్నాడని తెలిపారు. అందుకే తన నుంచి విడాకులకు అతడు దరఖాస్తు చేశాడని వివరించారు. ఆ క్రమంలో తన కుమారుడిని తనకు ఇవ్వలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను ఉద్యోగం సైతం చేశానని తెలిపారు. అయితే ఆ ఉద్యోగానికి తన భర్త బలవంతంగా రాజీనామా చేయించారని సీజేఐకి ఈ సందర్భంగా వివరించింది. మరోవైపు ఆమె భర్త పన్ను రిటర్న్‌లను కోర్టు పరిశీలించి.. అతడి ఆదాయం తక్కువగా ఉందని గుర్తించింది. ఆ క్రమంలో ఫ్లాట్ తీసుకుని మంచి ఉద్యోగాన్ని వెతుక్కోండంటూ ఆమెకు సూచించారు. అలా కాకుంటే.. రూ. 4 కోట్లు– భరణం తీసుకుని.. పుణె, హైదరాబాద్, బెంగళూరులో మంచి ఐటీ– ఉద్యోగాన్ని సంపాదించాలన్నారు. మీరు బాగా చదువుకుని కూడా.. బతుకు తెరువు కోసం ఇలా అడగడం భావ్యం కాదని భారత ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయి అభిప్రాయపడ్డారు. అనంతరం ఈ కేసులో తీర్పును ఆయన రిజర్వు చేశారు.

# పోరాట యోధుడు.. సమర్థ నేత

**అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు : సిపిఎం**

**ఆత్మకూర్, జూలై 22 (కొత్తస్వరం) :**

:కమ్యూనిస్టు ఉద్యమ యోధులు, సిపిఎం అగ్ర నేత కామ్రేడ్ వి.ఎస్.అచ్యుతానందన్(102) మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి కేరళ ప్రజలకు తీరనిలోటని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి. యేసు రత్నం, సీనియర్ నాయకులు ఏ రాజశేఖర్ లు అన్నారు. కామ్రేడ్ వీ ఎస్ అచ్యుతానందన్ మృతి సందర్భంగా పట్టణంలోని డాక్టర్ ఏ. ధనుంజయ మీటింగ్ హాల్ నందు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి ఏ. రణధీర్ అధ్యక్షతన వహించారు. ఈ సందర్భంగా అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ రాజశేఖర్, వి. యేసు రత్నం లు మాట్లాడుతూ "వివిఎస్గా అందరికీ చిరపరిచితులైన అచ్యుతానందన్ సుదీర్ఘ కాలంగా అస్వస్థతతో బాధపడుతూ సోమవారం మధ్యాహ్నం 3.20 గంటలకు కన్నుమూశారు. 101 ఏళ్ల ఆయన పొలిట్‌బ్యూరో మాజీ సభ్యులు. సమర్థవంతమైన నాయకుడిగా పేరొందిన అచ్యుతానందన్ కేరళలో అనేక పోరాటాలకు నాయకత్వం వహించారు. అస్పిన్‌వాల్ కంపెనీలో పనిచేస్తున్న సమయంలో కొబ్బరి పీచు కార్మికు లందరినీ సంఘటితపరిచిన నేత అచ్యుతానందన్. 1940లో 17 ఏళ్ల వయసులో ఆయన కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కుట్టనాడ్‌లో భూస్వాముల చేతిలో భయంకరమైన దోపిడీకి గురవుతున్న వ్యవసాయ కార్మికుల మధ్య వుంటూ వారితో కలిసి పనిచేసే బాధ్యతలను ఆయనకు కృష్ణ పిళ్ళై అప్పగించారు. ట్రావెన్‌కోర్ దివాన్‌కు వ్యతిరేకంగా పున్నప్ర-వాయలార్ పోరాట సమయంలో




విఎస్ అజ్ఞాతంలోకి వెళ్లాల్సి వచ్చింది. అరెస్టయిన తర్వాత కస్టడీలో ఆయన తీవ్ర వేధింపులను ఎదుర్కొన్నారు. 1956లో ఐక్య కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీకి విఎస్ ఎన్నికయ్యారు. 1958లో జాతీయ కౌన్సిల్‌కు ఎన్నికయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ను ఏర్పాటు చేయడానికి నేషనల్ కౌన్సిల్‌ను వీడి బయటకు వచ్చిన 32 మంది సభ్యుల్లో అచ్యుతానందన్ చివరి వారు. 1980 నుంచి 1991 వరకు సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన పనిచేశారు. 1964లో పార్టీ కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1985లో పొలిట్‌బ్యూరో సభ్యులయ్యారు. వృద్ధాప్యం కారణంగా 2022లో కేంద్ర కమిటీ నుంచి రిలీవ్ అయిన అచ్యుతానందన్ ఆ తర్వాత కేంద్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితులుగా వున్నారు.కేరళ అసెంబ్లీకి విఎస్ ఏడుసార్లు ఎన్నికయ్యారు. ప్రతిపక్ష నేతగా రెండుసార్లు పనిచేశారు. 2006 నుండి 2011 వరకు ముఖ్యమంత్రిగా వున్నారు. ముఖ్యమంత్రిగా ఆయన హయాంలో శ్రమ జీవుల సంక్షేమం కోసం అనేక చట్టపరమైన, పాలనాపరమైన చర్యలు తీసుకున్నారు. పార్టీతో ఆయనకు గల ఎనిమిదన్నర దశాబ్దాల సుదీర్ఘ అనుబంధంలో, కేరళలో కమ్యూనిస్టు ఉద్యమం సుస్థిరంగా వృద్ధి చెందిన క్రమాన్ని విఎస్ చూశారు. విఎస్ నేరుగా ప్రజలతో మాట్లాడడంలో దిట్ట. నిరాడంబరమైన జీవనశైలికి, సామాజిక న్యాయం పట్ల అచంచలమైన నిబద్ధతకు పేరొందిన విఎస్ కేరళ రాజకీయాల్లో తనదైన చెరగని ముద్ర వేశారు. ఆయన మృతి, పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు." అని వారు అన్నారు.. విఎస్ అచ్యుతానందన్ కు భార్య, కుమారుడు, కుమార్తెలకు సానుభూతిని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నరసింహ నాయక్, ఆత్మకూరు మండల కార్యదర్శి పి సుధాకర్, సీనియర్ నాయకులు ఏం రజాక్, సీనియర్ పాత్రికేయులు జోసెఫ్ చంద్రశేఖర్, నాయకులు మా భాష, డి రామ్ నాయక్ ఏ సురేంద్ర, వీరన్న, నాయకులు సామేలు,రవి, పెద్ద అంబయ్య, శిలార్, మల్లయ్య,ముర్తుజా, పుల్లయ్య, శీను, జబీవుల్లా,

# రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

**- యూరియా కోసం రోడ్డు ఎక్కుతున్న రైతులు**
**- రైతుల ఆందోళనపై ప్రజా ప్రతినిధులు స్పందించాలి**

**నందికొట్కూర్, జూలై 22 (కొత్తస్వరం) :**

ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రైతులకు సరిపడా యూరియాను అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం పార్టీ నాయకులు పి .పకీర్ సాహెబ్ విమర్శించారు. మంగళవారం స్థానిక మార్కెటింగ్ యాడ్ లో ఉన్న డీసీఎంఎస్ ద్వారా రైతులకు అందిస్తున్న యూరియాను అందించకపోవడంతో రైతులు సిపిఎం నాయకులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన సిపిఎం నాయకులు వెంటనే మార్కెట్ యార్డ్ చేరుకుని రైతులతో ఆందోళనకు సిద్ధమవ్వగా స్థానిక అధికారి సిపిఎం నాయకులతో చర్చలకు పిలిచారు. డీసీఎంఎస్ అధికారులు కౌలు రైతులకు యూరియాను అందించకపోవడం శోచనీయమన్నారు. పట్టాదారు పాసు పుస్తకం ఉన్న రైతు, కౌలు రైతులకు యూరియాను సమృద్ధిగా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల కుటుంబ సభ్యుల పేర్ల మీద మహిళా రైతుల పేర్ల మీద మహిళలపై పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్న యూరియా ను అందించడంలో అధికారులు మొండివైఖరి ప్రదర్శిస్తున్నారు. పట్టాదారు పాసుపుస్తకం లో ఉన్న రైతులకే యూరియా అందజేస్తామని డీసీఎంఎస్ అధికారులు



మొండికేయడంతో సిపిఎం నాయకులు వారితో చర్చలు జరిపి పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతి రైతుకు ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో దిగివచ్చిన డీసీఎంఎస్ అధికారులు అందరూ రైతులకు యూరియా అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం సిపిఎం నాయకులు మాట్లాడుతూ నియోజవర్గంలో రైతులు సాగు చేసుకున్న మొక్కజొన్న, వరి, మిరప, తదితర పంటలకు యూరియా అవసరమని అయితే ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నియోజవర్గంలో వర్షాలు విస్తారంగా కురవడంతో రైతులు వేసిన పంటలు ఆశాజనకంగా ఉన్నాయని హర్షం వ్యక్తం చేస్తున్న రైతులకు యూరియా అందకపోవడం శాపంగా మారిందని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించి యూరియాను గ్రామాలలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించాలని రైతుల కష్టాలను తీర్చేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు రమణ ,శ్రీరాములు, మద్దిలేటి ,షరీఫ్ ,కొండయ్య ,బాబు వెంకటేశ్వర్లు ,శ్రీనివాసులు తదితర రైతులు పాల్గొన్నారు.

# ఈ చలాన్ పేరుతో వస్తున్న నకిలీ ఏపీకె ఫైల్‌తో జాగ్రత్తగా ఉండండి

**ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్ తొందరపడి క్లిక్ చేయకండి : జిల్లా ఎస్పీ పి.జగదీష్**

**అనంతపురం, జూలై 22 (కొత్తస్వరం) :**

ఈ చలాన్ పేరుతో వచ్చే సందేశాల పట్ల జాగ్రత్తగా ఉండాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ చలాన్ పేరుతో వచ్చే లింక్స్ తొందరపడి క్లిక్ చేయొద్దని సూచించారు. వివిధ సామాజిక మాధ్యమాల్లో RTO Traffic Challan.apkఅనే పేరుతో వైరల్ అవుతోందన్నారు. ఈ లింక్‌ను క్లిక్ చేసి డౌన్‌లోడ్ చేసుకునే వారి ఫోన్‌లో రహస్య సమాచారాన్ని సైబర్? నేరగాళ్లు చోరీ చేసే ప్రమాదం ఉందన్నారు. ఇదివరకు పిఎం కిసాన్ యోజన, ఎస్బీఐ క్రెడిట్ కార్డులు, రివార్డులు, కెవైసి అప్డేట్ పేర్లతో సైబర్ మోసాలకు పాల్పడే నేరగాళ్లు నూతన ఎత్తుగడకు పథకం వేసి ట్రాఫిక్ చలానా పేరుతో ప్రజలను లూటీ చేసేందుకు సిద్ధమయ్యారనే గుర్తించుకుని అప్రమత్తంగా ఉండాలన్నారు.

**ఈ చలాన్ పేరున నేరం ఇలా..**

ముందుగా ఏపీకే ఫైల్‌ను పంపుతారు. నమ్మదగిన వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తారు. ఆ గ్రూపులో ఉన్న సభ్యులు దానిని నమ్మి ఆలోచించకుండా ఏపీకే ఫైల్‌ను క్లిక్ చేసి ఇన్‌స్టాల్ చేస్తారు. వెంటనే ...మీ అనుమతి లేకుండా క్రెడిట్ కార్డు నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు జరిగినట్లు మెసేజ్‌లు వస్తాయి.

**ఏపీకె ఫైల్‌ను మీరు ఇన్ స్టాల్ చేస్తే..**

అది మీ ఎస్ఎంఎస్ లను యాక్సెస్ చేయగలదు(ఓటీపీ లను తెలుసుకోవచ్చు). మీ బ్యాంక్ అకౌంట్, క్రెడిట్ కార్డు వివరాలను తెలుసుకోవచ్చు. మీ ఫోన్‌ను ఓ రిమోట్ మాదిరి సైబర్ నేరగాళ్లు నియంత్రించగలరు.

**ప్రజలకు సూచనలు..**

గుర్తు తెలియని, అనధికార లింక్‌లను క్లిక్ చేయకండి. ఏపీకే ఫైల్స్ డౌన్ లోడ్ చేయకండి. వాట్స్ యాప్ గ్రూపుల్లో షేర్ చేస్తే వచ్చే మెసేజ్‌లను గుడ్డిగా నమ్మకండి. నేరగాళ్లు వాటిని అధికారికంగా ఉన్నట్లే మాయ చేసి వాటిని అలా పెడతారు. యాప్స్‌ను ఎల్లప్పుడు గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేయండి. ఓటీపీ అలర్ట్స్‌ను ఎనేబుల్ చేసుకోండి. ఏవైనా మీ అనుమతి లేకుండా లావాదేవీలు జరిగినట్లు అనుమానాస్పదంగా అనిపిస్తే వెంటనే కార్డును బ్లాక్ చేయండి. సైబర్ నేరాల పట్ల ఫిర్యాదు చేయడానికి వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా www.cyber-crime.gov.in ద్వారా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.



# తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ డి.నరసింహ కిషోర్ ఆదేశాల ప్రకారం

**బొల్లినేని పారామెడికాల్ విద్యార్థులకు సిబ్బందికి సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం**
**ప్రకాష్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు**






**రాజమండ్రి, జూలై 22 (కొత్తస్వరం) :**

తూర్పుగోదావరి జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ డి. నరసింహ కిషోర్ ఆదేశాల ప్రకారము మంగళవారం బొల్లినేని పారామెడికాల్ విద్యార్థులకు సిబ్బందికి సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమ%శీ %ప్రకాష్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, జిల్లా సైబర్ ల్యాబ్ పోలీసులు. నిర్వహించడం జరిగింది. ఈ అవగాహన సదస్సు నందు ప్రకాష్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్ మాట్లాడుతూ సోషల్ మీడియా వాడడంలో జాగ్రతలు తీసుకోవాలని వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్స్టాగ్రామ్,టెలిగ్రామ్, స్నాప్చాట్, స్కైప్ లో అపరిచుతులతో చాటింగ్ చేయవద్దని, అనవసర లింక్‌లను, అప్లికేషను లను క్లిక్ చేయడంతో కలిగే అనర్థాలు గురించి వివరించారు. సైబర్ ల్యాబ్ పోలీసులు మాట్లాడుతూ.... సైబర్ నేరాలకు చదువుకున్న వారు ఎక్కువగా గురి అవుతున్నారని. ఈ మధ్యకాలం లో టాస్క్ ఫ్రాడ్, ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్ట్, కొరియర్ ఫ్రాడ్ రూపంలో అపరిచుతులు కొంతమంది డాక్టర్ల వద్ద నుండి కోట్ల రూపాయలు కాజేశారని అటువంటి విషయాల పట్ల జాగ్రత్త వహించాలని తెలియజేశారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని లేదా www.cybercrime.gov.in వెబ్ సైట్లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రకాష్ నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సతీష్, జిల్లా సైబర్ ల్యాబ్ సిబ్బంది అయిన వై వి సురేష్, డి. మహేష్ సుమారు 150 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన బుద్ధిమాంద్యం యువకుడి ఆచూకీ కనుగొని తండ్రికి అప్పగించిన అనంతపురం త్రీటౌన్ పోలీసులు



**అనంతపురం, జూలై 22 (కొత్తస్వరం) :**

బ్రహ్మసముద్రం మండలం బుడిమేపల్లికి చెందిన శ్రీరాములు బుద్ధిమాంద్యం కల్గిన తన కుమారుడు భరత్ (18 సం) సహా హైదరాబాద్ వెళ్లి మంగళవారం ఉదయం అనంతపురం ఆర్టీసీ బస్టాండు చేరుకున్నారు. కళ్యాణదుర్గం బస్సు ఎక్కాల్సి ఉంది. అంతలోనే స్థానికంగా ఉన్న వాష్ రూంకు తండ్రి వెళ్లాడు. తిరిగొచ్చి చూశాక భరత్ కన్పించలేదు. వెంటనే అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్లో తన కుమారుడు మిస్ అయినట్లు శ్రీరాములు ఫిర్యాదు చేశాడు. సి.ఐ శాంతిలాల్ స్పందించి కేసు నమోదు చేయించడంతో పాటు ఆ బుద్ధిమాంద్యం యువకుడి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. ఆర్టీసు బస్టాండు, పరిసర ప్రాంతాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో అక్కడి సీసీ కెమేరాలను పరిశీలించారు. ఆ అబ్బాయి బద్వేల్ బస్సు ఎక్కాడని సీసీ కెమేరాల ద్వారా తెలుసుకొని బుక్కరాయసముద్రం మండలం రెడ్డిపల్లి వద్ద సదరు బస్సును పోలీసులు ఆపి తప్పిపోయిన భరత్ ను హ్యాండోవర్ చేసుకున్నారు. ఆ తర్వాత భరత్ ను అప్పగించడంతో శ్రీరాములు హర్షం వ్యక్తం చేస్తూ పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# వైసిపి తప్పుడు ప్రచారాన్ని నిలదీయాలి: గొట్టిపాటి

**బాపట్ల,జులై 22(కొత్తస్వరం):**

వైసిపి పార్టీ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నిలదీయాలని ఎపి మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. బాపట్ల జిల్లా అద్దంకి నియోజకవర్గం వెంపరాలలో గొట్టిపాటి పర్యటించారు. సుపరిపాలనలో తొలి అడుగు భాగంగా ఇంటింటికి వెళ్లారు. రూ. 5 కోట్ల నాబార్డ్ నిధులతో నిర్మించిన రహదారికి, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రీకాల్ మేనిఫెస్టో అంటూ అసత్యాలతో తిరిగేవారిని తరిమికొట్టాలి అని అన్నారు. ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని గొట్టిపాటి రవికుమార్ తెలియజేశారు.

# "డ్రగ్స్ వద్దు బ్రో" విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**అనంతపురం, జూలై 22 (కొత్తస్వరం) :**

అనంతపురం జిల్లా ఈగల్ సెల్ ఆధ్వర్యంలో శ్రీ సత్య సాయి ఉమెన్స్ జూనియర్ కళాశాలలో మంగళవారం గంజా, డ్రగ్స్ ప్రమాదాల నుండి రక్షణ గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఈగల్ సెల్ ఆర్ ఎస్ ఐ హనుమంతు మాట్లాడుతూ, యువతలోకి డ్రగ్స్, గంజా ప్రవేశించే మార్గాలు, వాటి కారణంగా విద్య, ఆరోగ్యం, కుటుంబ జీవనంలో వచ్చే సమస్యలను వివరించారు. ఎన్ డి పి ఎస్ చట్టం ప్రకారం గంజా, డ్రగ్స్ వినియోగం, నిల్వ చేయడం, వ్యాపారం చేయడం నేరం అవుతుందని, దానికి ఎదురయ్యే శిక్షలను విద్యార్థులకు వివరించారు. ఈగల్ సెల్ ఆధ్వర్యంలో జిల్లాలో "సేఫ్ క్యాంపస్ జోన్" కార్యక్రమం అమలు అవుతూ, డ్రగ్స్ రవాణాకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యమని తెలిపారు.విద్యార్థులు ఈ విషయంలో అప్రమత్తంగా ఉండి, డ్రగ్స్ గురించి తెలిసిన సమాచారం వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఇవ్వాలని కోరారు. డ్రగ్స్, గంజాతో భవిష్యత్తు నాశనం అవుతుందని, "డ్రగ్స్ వద్దు బ్రో" అనే నినాదాన్ని ప్రతి విద్యార్థి పాటించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం ఐజీపీ ఈగల్ ఆకే రవికృష్ణ , అనంతపురం జిల్లా ఎస్పి పి. జగదీష్ సర్ ఆదేశాల మేరకు నిర్వహించబడింది. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల నుంచి వచ్చిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ, డ్రగ్స్ నుండి దూరంగా ఉండటమే కాకుండా ఇతరులను కూడా దూరంగా ఉంచే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు.

# హెూంమంత్రి వ్యక్తిగత సహాయకుడిగా చలామణి అవుతున్న నకిలీ వ్యక్తి అరెస్ట్

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,.**
**నకిలీ వ్యక్తులతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్న జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,**
**ఈ తరహా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,.**

**విజయనగరం, జూలై 22 (కొత్తస్వరం) :**



విజయనగరం జిల్లాలో రాష్ట్ర హెూం మంత్రి వ్యక్తిగత సహాయకుడిగా చలామణి అవుతున్న నకిలీ వ్యక్తి అల్లూరి అరవింద్ (21సం.లు) ను విజయనగరం 1వ పట్టణ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, తెలిపారు. వివరాల్లోకి వెళితే.. జూలై 21న ఒక వ్యక్తి జిల్లా పోలీసు కార్యాలయంనకు వచ్చి, రిసెప్షనిస్టుగా విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబులు అరుణను కలిసి, తాను రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత వ్యక్తిగత సహాయకుడిగా పరిచయం చేసుకున్నారన్నారు. అనంతరం, తాను జిల్లా ఎస్పీ అత్యవసరంగా కలవాలని కోరారు. అందుకు, మహిళా కానిస్టేబులు అరుణ ప్రస్తుతం జిల్లా ఎస్పీ పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రసల్ ఫిర్యాదులు చూస్తున్నారని, కొద్ది సమయం పడుతుందని తెలిపారు. గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు చేపట్టలేదని, తాను వెంటనే జిల్లా ఎస్పీ కలవాలని, లేకుంటే నీ అంతు తేలుస్తానని, ఉద్యోగం ఎలా చేస్తావో చూస్తానని, దౌర్జన్యం చేస్తూ, బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. ఈ విషయమై మహిళా కానిస్టేబులు అరుణ 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చెయ్యగా, పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారన్నారు. విచారణలో నిందితుడు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాకు చెందిన అల్లూరి అరవింద్ (21సం.లు) గుర్తించామన్నారు. నిందితుడు అల్లూరి అరవింద్ (21సం.లు) ను అరెస్టు చేసామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రజలు ఇటువంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి చర్యలు ఎవరు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ హెచ్చరించారు.

# విషాదం నింపిన బోనాల పండగ

**ఫుడ్ పాయిజన్‌తో ఒకరు మృతి**

**హైదరాబాద్,జులై 22(కొత్తస్వరం):**

హైదరాబాద్ లో బోనాల పండుగ విషాదం నింపింది. ఒకే కుటుంబానికి చెందిన 8 మందికి ఫుడ్ పాయిజన్ అయ్యింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా మిగతా ఏడుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ ఎల్బీ నగర్ లో ఈ విషాద ఘటన జరిగింది. హైదరాబాద్ వ్యాప్తంగా బోనాల ఉత్సవాలు ఘనంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఎల్బీ నగర్ లోని చింతల కుంటలోని ఓ ఫ్యామిలీ బోనాల పండుగ సందర్భంగా తెచ్చుకున్న చికెన్ , బోటి కూరను తెల్లవారు జామున తిన్నారు. దీంతో ఒకే కుటుంబంలోని 8 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో ఆర్టీసీ కండక్టర్ మృతి చెందాడు. మిగతా ఏడుగురు కుటుంబ సభ్యులు చింతల కుంటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధిత కుటుంబం తిన్న ఆహారం శాంపిల్స్ ల్యాబ్ కు పంపించారు.

# డ్రోన్లతో నిఘా వేసి మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా అంకితభావంతో పని చేయండి

**డ్రోన్లు వినియోగించి మహిళల్ని వేధించే అకతాయిల ఆగడాలపై నిఘా ఉంచండి**
**జిల్లాలోని శక్తి టీమ్స్ కు డ్రోన్ల వినియోగంపై ఒకరోజు శిక్షణ... టెక్నాలజీ వినియోగించి మెరుగైన సేవలు అందించాలని సూచనలు**
**మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు జరుగకుండా ఉండాలంటే ఏమి చేయాలో దిశానిర్ధేశం చేసిన జిల్లా ఎస్పీ**
**శక్తి టీమ్స్ వినియోగించే 28 టూవీలర్లను జెండా ఊపి ప్రారంభించి విధులపై దిశా నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ.**
**అత్యవసర సమయాల్లో మహిళల రక్షణ కొరకు ఏర్పాటుచేసిన శక్తి యాప్ వాట్సాప్ నంబర్ 7993485111 ను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి : జిల్లా ఎస్పీ పి.జగదీష్**









**అనంతపురం, జూలై 22 (కొత్తస్వరం) :**

డ్రోన్లతో నిఘా వేసి మహిళలు, పిల్లల భద్రతే లక్ష్యంగా అంకితభావంతో పని చేయాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశించారు. జిల్లాలోని శక్తి టీమ్స్ కు డ్రోన్ల వినియోగంపై మంగళవారం స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఒకరోజు శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మహిళలపై వేధింపులు, అఘాయిత్యాలు జరుగకుండా ఉండాలంటే ఏమి చేయాలో ఎస్పీ దిశానిర్ధేశం చేశారు.
ముందుగా...మహిళలు, చిన్నారుల భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్, వారు వినియోగించనున్న 28 ద్విచక్ర వాహనాలను జిల్లా ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో జెండా ఊపి ప్రారంభించారు. రాష్ట్రంలో మహిళలపై ఎటువంటి దాడులు, అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్' ను జిల్లాలో ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ తెలిపారు. శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, కాలేజీలు, షాపింగ్ మాల్స్, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్లలో నిఘా ఉంచాలన్నారు. ఈ శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా విధులు నిర్వహించి నేరాల శాతాన్ని తగ్గించాలని, మహిళలపై వేధింపులు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే అసాంఘిక శక్తులను చట్ట ప్రకారం శిక్ష పడేలా చూడాలన్నారు. మహిళలకు, చిన్నారులకు ఆపదలో మేమున్నామంటూ ఓ వైపు ధైర్యాన్నిస్తూ..అరాచక శక్తుల ఆట కట్టించాలన్నారు. మహిళా వివక్ష, హింస, లైంగిక వేధింపులకు సమాజంలో స్థానం లేదన్నారు. నేరాల కు అడ్డుకట్ట వేసేలా ప్రభావంతంగా విధులు నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు.

**నూతనంగా ఏర్పాటు చేసిన 7 బృందాలు..**

జిల్లా హెడ్ క్వార్టర్స్ లో రెండు బృందాలు, అనంతపురం అర్బన్ సబ్ డివిజన్ -1, అనంతపురం రూరల్ సబ్ డివిజన్ -1, తాడిపత్రి సబ్ డివిజన్ -1, గుంతకల్లు సబ్ డివిజన్ -1 , కళ్యాణదుర్గం సబ్ డివిజన్ -1 చొప్పున సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తిస్తారన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ నకు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 , 181, 1098, 1930 కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్స్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు తక్షణమే అప్రమత్తమై వేగవంతంగా సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యలను పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పట్టుబడ్డ అసాంఘిక శక్తులను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారికి తదుపరి చర్యలకై అప్పగించాలన్నారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా శక్తి టీములకు జిల్లా ఎస్.పి పలు సూచనలు చేశారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించేలా టీమ్స్ కృషిచేయాలన్నారు.

**శక్తి యాప్ పనిచేసే విధానం..**

ఒన్ టచ్ SOS బటన్- వెంటనే పోలీసులను అలర్ట్ చేసి సహాయం అందిస్తుంది. Shake Trigger/Hand Gesture SoS యాప్ ఓపెన్ చేయకుండానే SOS అలర్ట్ పంపించవచ్చు. లైవ్ ట్రాకింగ్ అండ్ ఎవిడెన్స్ షేరింగ్ కాలర్ లొకేషన్, 10 సెకన్ల ఆడియో, వీడియో కంట్రోల్ రూమ్ కి పంపబడుతుంది తద్వారా పోలీసు అధికారులు తక్షణమే స్పందించి వేగవంతంగా చర్యలు తీసుకుంటారు.

**ముఖ్యమైన ఫీచర్లు..**

ఫిర్యాదు నమోదు, తప్పిపోయిన పిల్లల గురించి రిపోర్టు చేయడం, అక్రమ కార్యకలాపాలపై రిపోర్టు చేయడం, నైట్ షెల్టర్స్, భద్రతతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివరాలు మరియు మొబైల్ నంబర్లు, వాట్సాప్ గవర్నెన్స్, అత్యవసర కాంటాక్ట్... లాంటి ఎన్నో అధునాతన ఫీచర్స్ ను ఈ "శక్తి" యాప్ లో పొందుపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, సి.ఐ లు ధరణీ కిశోర్ , క్రాంతికుమార్ , వెంకటేశులు, ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్, బాబు, ఎస్పీ సిసి ఆంజనేయ ప్రసాద్ , మరియు శక్తి టీమ్స్ సభ్యులు పాల్గొన్నారు.

# పోలీసు సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ఔట్ పోస్టు ఏర్పాటు

**విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్**

**విజయనగరం/గంట్యాడ, జూలై 22 (కొత్తస్వరం) :**

విజయనగరం జిల్లా గంట్యాడ మండల పోలీసు స్టేషను పరిధిలోని తాటిపూడి గ్రామంలో పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పోలీసు ఔట్ పోస్టును ఏర్పాటు చేసామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిధిగా హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించి, ఔట్ పోస్టును ప్రారంభించారు. జిల్లా ఎస్పీ కి గంట్యాడ పోలీసులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, ఐపిఎస్ మాట్లాడుతూ - ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కల్పించడంతోపాటు పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే ఉద్దేశ్యంతో తాటిపూడిలో అభివృద్ధి చేసిన పోలీసు ఔట్ పోస్టును ప్రారంభించామన్నారు. ఇటీవల కాలంలో తాటిపూడి రిజర్వాయరును చూడడానికి, డ్యాంలో బోటింగు చేసేందుకు టూరిస్టుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా టూరిస్టులను సురక్షితంగా తిరిగి పంపేందుకు, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నియంత్రించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. డ్యాంలో బోటింగుకు వెళ్ళే సమయంలో టూరిస్టులు తప్పనిసరిగా లైఫ్ జాకెట్స్ ను వినియోగించడం, బోట్స్ పూర్తి స్థాయి సామర్ధ్యంతో పని చేయడం, ప్రమాదాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టడం వంటి విధులను ఔట్ పోస్టు పోలీసు సిబ్బంది నిర్వహిస్తారన్నారు. ఈ ఔట్ పోస్టులో ఒక హెడ్ కానిస్టేబులు, ఒక కానిస్టేబులు విధులు నిర్వహిస్తూ, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను విద్యార్థులు, యువత, ప్రజలకు వివరిస్తూ, వాటికి దూరంగా ఉండాలని, సైబరు మోసాలు, మహిళల భద్రత, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పిస్తున్నామ న్నారు. మహిళల భద్రతకు జిల్లాలో ఐదు శక్తి టీమ్సున్న ఏర్పాటు చేసామని, ఈ టీమ్స్ ప్రజలు ఎక్కువగా గుమిగూడి ఉండే ప్రాంతాలైన ఆర్టీసి కాంప్లెక్సులు, రైల్వే స్టేషన్లు, స్కూల్స్, కాలేజ్స్, ముఖ్య జంక్షన్లను సందర్శించి, శక్తి యాప్ పట్ల, యాప్ ఏవిధంగా వినియోగించాలన్న విషయాలపైన విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అనంతరం, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మరియు ఇతర పోలీసు అధికారులు తాటిపూడి డ్యాంను సందర్శించి, డ్యాంలో బోటులో ప్రయాణించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి. సౌమ్యలత, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, ఎస్బి సిఐ ఏవీ లీలారావు, విజయనగరం రూరల్ సిఐ బి. లక్ష్మణరావు, గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రజలతో సామరస్యంగా, సఖ్యతతో చట్టంపై గౌరవం పెంపొందేటట్లు మెలగండి

**పోలీసింగ్ స్కిల్స్ పెంచుకోండి**
**విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పని చేయండి**
**అర్ధ-వార్షిక నేర సమీక్షా కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు**







**చిత్తూరు, జూలై 22 (కొత్తస్వరం) :**

చిత్తూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారంమంగళవారం అర్ధ-వార్షిక నేర సమీక్షా కార్యక్రమమును చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోలు జిల్లా పోలీసులు మరియు ఇతర శాఖల అధికారులతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్ధ-వార్షిక నేర సమీక్షా కార్యక్రమము నందు మొదటగా ఇతర శాఖల వారితో పోలీసు శాఖ సమన్వయాన్ని ప్రస్తావిస్తూ, క్రైమ్ నిరోధన, దర్యాప్తు మరియు శాంతిభద్రతల పరిరక్షణలో ఇతర ప్రభుత్వ శాఖల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. వివిధ శాఖల పాత్రను వివరిస్తూ, మెడికో-లీగల్ కేసుల్లో వైద్య ఆరోగ్య శాఖ సహకారం, పోస్టుమార్టం నివేదికల విషయంలో నిపుణుల అభిప్రాయాలు, రోడ్డు ప్రమాదాల దర్యాప్తులో రోడ్డు మరియు భవనాల శాఖ సమాచారం, సాంకేతిక నేరాలలో ఐటీ విభాగం మద్దతు, విద్యుత్ దొంగతనాలు మరియు ప్రమాదాలపై విద్యుత్ శాఖ సమాచారం, అలాగే అటవీ నేరాలపై అటవీ శాఖ సమాచారం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఇతర శాఖలతో సమన్వయం ద్వారా కేసుల పరిష్కార వేగం పెరిగి, న్యాయం త్వరితగతిన జరిగే అవకాశాలు పెరుగుతాయని, అందువల్ల ప్రతి శాఖ తమ వంతు బాధ్యతగా పోలీసు శాఖకు అవసరమైన సమాచారం, సహకారం సమయానికి అందించాలని కోరారు.

**అనంతరం జిల్లా పోలీసు అధికారులుతో సమీక్షిస్తూ....**

ప్రజలతో మన ప్రవర్తన ఆదర్శనీయంగా వుండాలని, జిల్లా నందు విజిబుల్ పోలీసింగ్ పెంచే విధంగా పని చేయాలని తెలిపారు. గత 6 నెలలుగా జిల్లా వ్యాప్తంగా వివిధ అంశాలపై నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వాటి ఫలితాల గురించి, రోడ్డు భద్రతకు, రోడ్డు ప్రమాదాలు తగ్గించడంలో అమలు జరిపిన కార్యాచరణల గురించి, మాదకద్రవ్యాల అక్రమ రవాణా అరికట్టడం మరియు నాన్-బైలబుల్ వారంట్స్( ఎన్ బి డబ్ల్యు)గురించి చర్చించారు. పెండింగ్ లో ఉన్న యు ఐ, పీటీ, గ్రేవ్ కేసులు మరియు హత్యలు, మిస్సింగ్ కేసులు, దోపిడీ దొంగతనాలు, మిస్సింగ్ కేసులు, పోక్సో కేసులను, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులు, మహిళలపై జరిగే నేరాల వివరాలు, తదితర కేసులను లోతుగా సమీక్ష చేశారు. కేసులను త్వరిత గతిలో నేర పరిశోధన చేసి పరిష్కరించ వలసినదిగా ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ కేసుల్లో పురోగతిపై సమీక్ష చేశారు. సీసీటీఎన్ఎస్ (క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్వర్క్ అండ్ సిస్టంస్) డేటాను తక్షణమే మరియు క్రమం తప్పకుండా నవీకరిస్తూ ఉండండి. ప్రతి మార్పును సీసీటీన్స్ డేటాలో వెంటనే నమోదు చేసి, అప్డేట్ చేయాలి. సీసీటీన్స్ వ్యవస్థలో డేటాను ఎప్పటికప్పుడు సరైన విధంగా అప్డేట్ చేయడం అవసరం. క్రైమ్ మరియు క్రిమినల్ వివరాలను సీసీటీన్స్ లో నిరంతరంగా నవీకరిస్తూ ఉండండి. సమయానికి సీసీటీన్స్ డేటాను సరిగ్గా నమోదు చేసి, అప్డేట్ చేయడం నిర్ధారించాలి. అసాంఘిక కార్యకలాపాల అణచివేతకు డ్రోన్ ల సహాయంతో నిఘా పెంచండి. ఇప్పటికే సిబ్బందికి డ్రోన్ శిక్షణ ఇవ్వడం జరిగింది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి నేర పరిశోధన, శాంతి భద్రతల పరిరక్షణ, భారీ సమావేశాల్లో భద్రతా చర్యలు తీసుకోవడం వంటి విభిన్న దశల్లో డ్రోన్లు ఉపయోగపడుతాయి. ముఖ్యంగా పెద్ద ఎత్తున జరిగే సభలు, ర్యాలీలు, ట్రాఫిక్ కంట్రోల్, అటవీ ప్రాంతాల పర్యవేక్షణ, కల్తీ మద్య తయారీ స్థలాల గుర్తింపు వంటి విభాగాల్లో డ్రోన్ లు సహాయపడుతాయి. "ప్రజలందరిలో సైబర్ మోసాలపై అవగాహన పెంచేలా మీరు చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద లింకులు, మెయిల్స్ ఓపెన్ చేయడం వల్ల బ్యాంకు ఖాతాలలో నగదు మాయం అయ్యే ప్రమాదం ఉన్నదని ప్రతి ఒక్కరికి తెలియ జేయాలి. యాప్ ద్వారా లోన్ ఇస్తామంటూ ఫోన్లు చేసే దుర్మార్గుల నుండి జాగ్రత్తగా ఉండాలని, అవి మోసాలే అన్న విషయాన్ని గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాల వరకూ అందరికి వివరించాలి. ఎవరైనా మోసపోయినట్ట యితే భయపడకుండా వెంటనే 1930 నెంబర్‌కు కాల్ చేయాలి లేదా http://cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలన్న విషయాన్ని ప్రజలకు తెలియజే యాలి. అలాగే జిల్లా పోలీస్ వాట్సప్ నెంబర్ 944090 0005, సైబర్ మిత్ర 9121211100 లకు సమాచారం ఇవ్వాలన్న విషయాన్ని కూడా ప్రచారం చేయాలి. మీ తక్షణ స్పందన వల్ల ఎంతో మంది ప్రజలు మోసాలకు బలి కాకుండా తప్పించుకోగలుగుతారు." ఈ అర్ధ-వార్షిక నేర సమీక్షా కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డి ఎఫ్ ఓ ధరణి, డి ఆర్ ఓ మోహన్ కుమార్, రైల్వే డి.ఎస్పీ హర్షిత, ఆర్టీవో రంజిత్ కుమార్, డిఈఓ వరలక్ష్మీ, జిల్లా వ్యాప్తంగా ఉన్న డీస్పీ లు, ఇన్స్పెక్టర్ లు, ఎస్.ఐ లు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అనంతపురం రేంజ్ అధికారులతో ఉమెన్ సేఫ్టీ ఐజీపీ బి.రాజ కుమారి, జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

**చిత్తూరు, జూలై 22 (కొత్తస్వరం) :**

చిత్తూరు జిల్లా నుండి జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు, జిల్లాలోని ఇన్స్పెక్టర్ పై స్థాయి అధికారులతో ఈ సమీక్ష సమావేశం పట్టణములోని పోలీస్ గెస్ట్ హౌస్, కాన్ఫరెన్స్ హాల్ నందు మంగళవారం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ నందు ఐ జి. రాజకుమారి అనంతపురం రేంజ్ నందు గల జిల్లాల ఎస్పీలతో మాట్లాడుతూ ఆయా జిల్లాలలోని మహిళల భద్రత, బాలల రక్షణపై తీసుకుంటున్న చర్యలపై మరియు ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు అధికారులు మరియు సిబ్బంది స్పందిస్తున్న పని తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సమీక్షలో బాగంగా... మొదటగా పెండింగ్‌లో ఉన్న పోక్సో కేసుల పరిశీలనలో బాగంగా పిల్లలపై లైంగిక నేరాలకు సంబంధించిన పోక్సో కేసుల పరిష్కార దశలు, విచారణా పురోగతి, న్యాయస్థానాలలో కేసుల స్థితిగతులు, తదితర విషయాలపై సమగ్ర సమీక్ష చేసారు. నేరాన్ని త్వరగా నిర్ధారించేలా విచారణను వేగవంతం చేయాలని, కోర్టుల్లో శీఘ్రంగా చార్జ్‌షీట్‌లను దాఖలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఐ టి ఎస్ ఎస్ ఓ (ఇన్వెస్టిగేషన్ ట్రాకింగ్ సిస్టం ఫర్ సెక్సువల్ ఆఫన్సెస్) ద్వారా లైంగిక నేరాలపై నమోదైన కేసులకు సంబంధించి 60 రోజుల్లో చార్జ్‌షీట్ వేసే అంశంపై ప్రతి జిల్లా పనితీరును సమీక్షించారు. ఆలస్యం లేకుండా చార్జ్‌షీట్లు వేయడం ద్వారా న్యాయం త్వరగా జరిగేలా చూడాలని సూచించారు. మహిళలు మరియు బాలికలు మిస్సింగ్ అయిన కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీటిలో ట్రాఫికింగ్, ప్రేమ వ్యవహారాలు, కుటుంబ సమస్యలు వంటి కారణాలపై స్పష్టత తీసుకురావాలన్నారు. ప్రతి కేసును ఒక మానవీయ కోణంలో పరిశీలించి, బాధితుల రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మునుపటి లైంగిక నేరాల చరిత్ర కలిగిన వ్యక్తులపై షీట్‌లు తెరచడం ద్వారా వారిపై కంట్రోల్ పెట్టాలని, పునరావృత నేరాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. వారి వాహనాలు, నివాస ప్రాంతాలపై నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు. ప్రజలలో మహిళల భద్రతపై ఉన్న అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నంగా "పర్సెప్షన్ ట్రాకింగ్" నిర్వహించాలన్నారు. మహిళలు పోలీసులపై ఎంత విశ్వాసం కలిగి ఉన్నారో, వారి భద్రతపై వారు ఎలా భావిస్తున్నారో తెలుసుకునేలా ఫీడ్‌బ్యాక్ మెకానిజం ఏర్పాటుపై చర్చ జరిగింది. మహిళలపై నేరాలు, వేధింపులు వంటి అంశాలపై గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో శక్తి టీమ్స్ భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. స్కూల్స్, కాలేజీలు, బస్ స్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రదేశాల్లో ప్రజల్లో చైతన్యం పెంచేలా కృషి చేయాలన్నారు. పిల్లలు, యువతీ యువకుల్లో న్యాయం కోసం నిలబడే ధైర్యాన్ని కలిగించేలా 'శక్తి వారియర్స్' అనే స్వచ్ఛంద సదస్సులు, టీమ్‌లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ వారియర్స్ స్థానికంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. లైంగిక నేరాల విషయంలో పోలీసులు జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరించాలి. బాధితుల పట్ల సానుభూతి కలిగిన తీరు ప్రదర్శించటం ద్వారా వారి మనోభావాలను గౌరవించాలి. సంఘటనలు జరిగిన వెంటనే వ్యవస్థ వేగవంతంగా స్పందించేలా మానవీయతతో కూడిన పోలీసింగ్ పద్ధతులు అమలు చేయాలి. ప్రతి పోలీసు అధికారి తన పరిధిలో ఉన్న కేసుల వివరాలను సమగ్రమైన రిపోర్టుగా రూపొందించి, ప్రతిదశలో పారదర్శకత ఉండేలా చూడాలి. మహిళా భద్రతపై ప్రతి స్థాయిలో సమన్వయాన్ని బలోపేతం చేసి, సమగ్ర చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశం అనంతరం, జిల్లా ఎస్పీ అధికారులకు ఐజీపీ ఇచ్చిన ఆదేశాలను పూర్తి గౌరవంతో అమలు చేయాలని, జూమ్ కాన్ఫరెన్స్‌లో చర్చించబడిన అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచనలు జారీచేశారు. మహిళల భద్రత, బాలల రక్షణకు సంబంధించి ప్రతి అంశాన్ని ప్రాధాన్యతగా తీసుకుని, సమన్వయంతో, బాధ్యతతో ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. ఈ జూమ్ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా ఎస్పీ తో పాటుగా జిల్లాలోని డి.ఎస్పీ లు, ఇన్స్పెక్టర్ లు మరియు మహిళా స్టేషన్ ఎస్.ఐ. పాల్గొన్నారు.





## పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లైంగిక సంబంధం పెట్టుకుని, పెళ్ళికి నిరాకరించిన వ్యక్తికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5,000 జరిమాన

**జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి**




**భీమవరం, జూలై 22 (కొత్తస్వరం) :**

పెళ్లి చేసుకుంటానని నమ్మించి, లైంగిక సంబంధం పెట్టుకుని, పెళ్ళికి నిరాకరించిన వ్యక్తికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 5,000 జరిమాన విధిస్తూ ఏలూరు 5వ అదనపు, జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.వి.ఎస్. మురళీ కృష్ణ తీర్పు చెప్పినట్లు జిల్లా ఎస్పీ మంగళవారం తెలిపారు. అంజురి ప్రసన్న కుమార్, తండ్రి: రామకృష్ణ, వెంకటరామాపురం గ్రామం, పెనుగొండ మండలం. నిందితుడు తన చిక్కుడు పొలంలో ఏడేళ్లకు పైగా కూలీగా పనిచేసిన బాధితురాలని పెళ్లి చేసుకుంటానని అబద్ధపు వాగ్దానాలతో నమ్మించి, లైంగిక దోపిడీకి పాల్పడ్డాడు. అనంతరం బాధితురాలి తల్లిదండ్రులు పెళ్లి కోసం నిందితుడిని సంప్రదించగా పెళ్లికి నిరాకరించడంతో 2021 డిసెంబర్ 22వ తేదీన బాధితురాలు పెనుగొండ పోలీస్ స్టేషన్ నందు పిర్యాదు చేయగా, అప్పటి సబ్-ఇన్‌స్పెక్టర్ బి. మోహన్ రావు %జతీ.చీశీ.392/2021. ఖ/గా 417, 376(2)(అ%) కేసు నమోదు చేయగా, అప్పటి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.వి.వి. నాగేశ్వర రావు క్షుణ్ణంగా దర్యాప్తు చేసి తణుకులోని ఎ.జె.ఎఫ్.సి.ఎం. కోర్ట్-IIలో ఛార్జ్ షీట్ దాఖలు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఏలూరు 5వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఆర్.వి.వి.ఎస్. మురళీ కృష్ణ సదరు నిందితుడికి 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు ?5,000 జరిమానా విధిస్తూ ఈ రోజు తుది తీర్పును వెల్లడించడం జరిగింది. ఈ కేసులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. రామ్ ఆంజనేయులు ప్రాసిక్యూషన్ తరఫున సమర్థవంతంగా వాదనలు వినిపించగా, సాక్షులను సమయానికి కోర్టులో హాజరు పరచడం ద్వారా ఈ కేసులో త్వరితగతిన తీర్పు వెలువడేందుకు కీలకంగా వ్యవహరించిన ప్రస్తుత పెనుగొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాయుడు విజయ్ కుమార్, సబ్-ఇన్‌స్పెక్టర్ శ్రీ కె. గంగాధర రావు మరియు హెడ్ కానిస్టేబుల్ ఎ. తిమ్మరాజు, కానిస్టేబుల్ ఎం. నాగబాబు గార్లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు - నేర నియంత్రణ చర్యలు







**శ్రీకాకుళం, జూలై 22 (కొత్తస్వరం) :**

నేర నియంత్రణ చర్యలలో భాగంగా టెక్కలి పోలీసు స్టేషన్ పోలీసు ఇన్స్పెక్టర్ ఎం. విజయ కుమార్ ఆద్వర్యంలో పోలీసులు మంగళవారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయానికి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ లో భాగంగా టెక్కలి పోలిసు స్టేషనులు పరిధిలో సిఐ, ఎస్ఐల అధ్వర్యంలో పోలిసు సిబ్బంది వారి పరిధిలో ఉన్న పలు వార్డు, గ్రామాలలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.గ్రామాల్లో ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి ఊరు చివర ప్రాంతాల్లో సోదాలు చేసి అక్రమ మద్యం, గంజాయి, నిల్వలుపై ఆరా తీశారు.పాత నేరస్థులు, ట్రబుల్ మాంగర్స్,కొత్త, అనుమానిత,నేర చరిత్ర కల్గిన వ్యక్తులు ఇళ్లల్లో సోదాలు నిర్వహించి,వారి జీవన విధానం,వృత్తి విధానం పై ఆరా తీసి చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలు అరికట్టి,నేర నియంత్రణ చర్యలు చేపడ్తున్న జిల్లా పోలీసులు.ఈ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ తనిఖీల్లో ఏటువంటి,సరైన వాహన పత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలు గుర్తించి, పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కొత్త వ్యక్తులు సమాచారాన్ని తెలపాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇసుక మరియు గ్రావెల్‌కు అనుమతులు ఇవ్వాలి

ఎమ్మార్వోకు వినతి పత్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**అశ్వాపురం, జూలై 22 (కొత్తస్వరం) :**

మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు ముమ్మరంగా సాగుతున్నాయని కానీ లబ్ధిదారులకు ఇసుక మరియు గ్రావెల్ కోసం ఇబ్బందులు పడుతున్నారని అధిక ధరలు పెట్టి కొనవలసిన పరిస్థితి ఏర్పడుతుందని బడుగు బలహీన వర్గాలైన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు గోదావరి నుండి ఇసుకను సీతారామ ప్రాజెక్టు కెనాల్ సంబంధించిన ట్రావెల్ ని తోలుకునే అవకాశం కల్పించాలని ఈరోజు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మార్వో కి వినతిపత్రం సమర్పించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి కమటం నరేష్, మారోజు కృష్ణమాచారి, యువజన నాయకుడు పర్వత నరేష్, ఇందిరమ్మ లబ్ధిదారులు చిన్నూరి వీరభద్రం, ఉపేందర్, నరేష్ పసుల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## బోనమెత్తిన కుషాయిగూడ ఆర్టీసీ డిపో ఉద్యోగులు



**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుషాయిగూడ, జూలై 22 కొత్త స్వరం ప్రతినిధి :**

కుషాయిగూడ ఆర్టీసీ డిపోలో డిపో మేనేజర్ బి. మహేష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు డిపో ఆవరణలో ఉన్న గట్టు మైసమ్మకు బోనం సమర్పించారు. డిపో ఉద్యోగం మరియు ప్రయాణికులు సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారికి డిపో సిబ్బంది మొక్కులు సమర్పించుకొని పూజలు నిర్వహించడం జరిగింది దీప వచ్చే సంవత్సరం నా వాళ్ళ బాటలో ప్రయాణించాలని సికింద్రాబాద్ రీజనల్ లో నెంబర్ వన్ కుషాయిగూడ డిపో అవార్డు తీసుకురావాలని అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఆనందరావు ఎమ్మెస్ శ్రీనివాస్ రావు సెక్యూరిటీ కె ఎస్ రెడ్డి వెల్ఫేర్ మెంబర్ రాములు కౌసల్య,సృజన, ఇంద్ర, అంజలి, రోజా, స్వరూప, రమాదేవి సెక్యూరిటీ సిబ్బంది సూపర్వైజర్ డ్రైవర్లు కండక్టర్లు మెకానిక్లు సిబ్బంది తదితరులు పాల్గొని అమ్మవారికి మొక్కులు సమర్పించుకున్నారు.

## మల్కాజ్గిరిలో బోనాల పండుగ - భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి

**మల్కాజ్గిరి జిల్లా, జులై 22 కొత్త స్వరం ప్రతినిధి :-**

మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. దేవాలయాల్లో భక్తుల రద్దీ అధికంగా కనిపించగా, తొట్టెల ఊరేగింపులు, పలహారం బండ్లఊరేగింపులు ఎంతోవైభవంగా నిర్వహించబడ్డాయి. ఈపండుగను శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు రాచకొండ పోలీస్ కమిషనర్ శ్రీ జి. సుధీర్ బాబు, ఐపీఎస్ గారి ప్రత్యేక ఆదేశాల మేరకు, శ్రీమతి పి.వి. పద్మజ డీసీపీ మల్కాజ్గిరి, శ్రీ ఎస్. చక్రపాణి ఏసీపీ మల్కాజ్గిరి గారి పర్యవేక్షణలో ప్రత్యేక బలగాలు, మల్కాజ్గిరి పోలీస్ సిబ్బంది మరిన్ని భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పండుగ విజయవంతంగా ముగిసింది. ఈ విజయవంతమైన నిర్వహణకు తమ సహకారం అందించినప్రజలందరికీ దేవాలయాల కమిటీ సభ్యులకుతొట్టెల మరియు పలహారం బండ్ల ఊరేగింపు నిర్వాహకులకు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు సహకరించిన ప్రతి ఒక్కరికి మల్కాజ్గిరి పోలీస్ స్టేషన్ తరఫున ఇన్స్పెక్టర్ బి. సత్యనారాయణ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



# "శౌర్య" కార్యక్రమంతో సైబరు, రహదారి, మహిళల భద్రతపై అవగాహన

విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్



**విజయనగరం, జూలై 22 (కొత్తస్వరం) :**

విజయనగరం పట్టణం ముడిదాం గ్రామం వద్ద గల 'ఇన్సిపైరో' స్కూలులో విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 'శౌర్య' పేరుతో సైబరు, రహదారి, మహిళల భద్రత, మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపట్ల అవగాహన కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, మాట్లాడుతూ - యువత చిన్న వయస్సులోనే మాదక ద్రవ్యాలకు అలవాటుపడి, జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. ఎవరైనా ఒకసారి డ్రగ్స్ తీసుకోవడానికి అలవాటు పడితే వారికి తెలయకుండానే, త్వరితగతినే వాటికి బానిసలుగా మారే ప్రమాదముందన్నారు. కావున, విద్యార్థులు మత్తు కలిగించే మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు, యువత చెడు మార్గాల్లో నడుస్తున్నారని గుర్తించి, వారిని సన్మార్గంలో నడిపించేందుకు 'సంకల్పం' కార్యక్రమంతో జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అంతేకాకుండా, గంజాయి అక్రమ రవాణను నియంత్రించేందుకు ప్రత్యేక కార్యచరణ రూపొందించి, పెద్ద ఎత్తున గంజాయిని సీజ్ చేయడంతోపాటు, అందుకు కారకులైన నిందితులను అరెస్టు చేసామన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన యువత డ్రగ్స్ ను కొనుగోలు చేసేందుకు అవసరమైన డబ్బులు లేక, దొంగతనాలకు పాల్పడుతూ, జీవితాలను నాశనం చేసుకుంటున్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. సైబరు నేరాలు పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన సోషల్ మీడియాలో ప్రచారమయ్యే విషయాలు నిజమని భావించి, డబ్బులను పోగొట్టుకున్నారన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చేసే కాల్స్ కు స్పందించవద్దని, వారు పంపే లింకులపై క్లిక్ చేయవద్దని, ఇతరులతో ఒటిపి నంబర్లును షేర్ చెయ్యవద్దన్నారు. ఇటీవల కాలంలో డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్ళు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. మీ పేరుతో కొరియర్ వచ్చిందని, ఆ ప్యాకెట్‌లో నిషేధిత డ్రగ్స్ దొరికాయని, విచారణకు హాజరుకావాలని, డిజిటల్ అరెస్టు చేసామని బెదిరింపులకు పాల్పడుతూ, డబ్బులను దోచుకుంటున్నారన్నారు. రహదారి భద్రత పట్ల కూడా విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. మైనరు డ్రైవింగుకు పాల్పడవద్దని, లైసెన్సు లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. చాలామంది యువత రహదారి ప్రమాదాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కావున, వాహనాలను నడిపేటప్పుడు నాణ్యత కలిగిన హెల్మెట్స్ ను ధరించాలని, రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. మహిళల భద్రతకు పోలీసుశాఖ చాలా చర్యలు చేపడుతుందని, ఇందుకుగాను ప్రత్యేకంగా శక్తి యాప్ ను అందుబాటులోకి తీసుకొని వచ్చిందన్నారు. ప్రతీ ఒక్కరూ తమ మొబైల్స్ తప్పనిసరిగా శక్తి యాప్ను డౌన్లోడు చేసుకోవాలన్నారు. ఎవరికైనా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడినపుడు మొబైల్ ఫోనులోని శక్తి యాప్ ఎస్.ఓ.ఎస్. బటన్ క్లిక్ చేస్తే, దగ్గరలో ఉన్న పోలీసు సిబ్బంది క్షణాల్లో మీ వద్దకు చేరుకొని రక్షణ కల్పిస్తారని తెలిపారు. చాలామంది విద్యార్థులు 18సం.లు నిండకుండానే లైంగిక నేరాల్లో చిక్కుకోవడం వలన వారిపై పోక్సో కేసులు నమోదవుతున్నాయన్నారు. ఈ కేసుల్లో నిందితులుగా అరెస్టు అయితే విద్యార్థి జీవితం నాశనం కావడంతోపాటు, 10సం.లు వరకు జైలుశిక్ష లేదా జీవిత ఖైదు2 విధించబడుతుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. అనంతరం, రోటరీ క్లబ్ ప్రత్యేకంగా రూపొందించిన శౌర్య వాల్ పోస్టరును జిల్లా ఎస్పీ ఆవిష్కరించి, రాష్ట్ర వ్యాప్తంగా శౌర్య కార్యక్రమాన్ని అన్ని కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించాలని రోటరీ క్లబ్ సంకల్పించినందుకు గాను రోటరీ క్లబ్ సభ్యులను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ చైర్మన్ డా.ఎం.వెంకటేశ్వర రావు, ఇన్సిపైరో స్కూలు డైరెక్టరు రవి కే. మండ, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, ఇన్సిపైరో, పోలీసు స్కూలు, ఆర్కే జూనియర్ కాలేజ్ మరియు కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ఆలయాలు, చర్చ్, మసీద్‌లు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు తప్పనసరి

పెండింగ్ వారెంట్లు త్వరితగతిన అమలు పరచాలి

అధికారులకు దిశ నిర్దేశాలు

జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, జూలై 22 (కొత్తస్వరం) :**

నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని, ఆలయాలు చర్చిలు,మసీదులు వంటి ప్రార్థన మందిరాలు వద్ద నిర్వాహకులు కమిటీ సభ్యులు సహాయ సహకారాలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని పోలీస్ అధికారులు జిల్లా ఎస్పీ కె.వి మహేశ్వర రెడ్డి దిశ నిర్దేశాలు చేశారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నేర నియంత్రణ చర్యలు, ప్రజా ఫిర్యాదులు పరిష్కారం,మాదక ద్రవ్యాలు నియంత్రణ,నాన్ బెయిల్ బుల్ వారెంట్లు అమలు,సీసీ కెమెరాలు ఏర్పాటు,విజిబుల్ పోలీసింగ్, కార్డన్ అండ్ సెర్చ్ సోదాలు తదితర అంశాలపై జిల్లాలో గల డీఎస్పీలు, సీఐలుతో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల స్వీకరణ పరిష్కారం కార్యక్రమంలో స్వీకరించి ప్రతి ఫిర్యాదులను త్వరితగతిన విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని, మహిళలు,ఫిర్యాదు దారులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. పెండింగ్లో ఉన్న నాన్ బెయిల్ బుల్ వారెంట్లు త్వరగా అమలు పరచాలన్నారు. ఆలయాలు, చర్చ్,మసీదులు వంటి ప్రార్థన మందిరాలు వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని,భద్రత చర్యలు, జాగ్రత్తలు పాటించేవిధంగా కమిటీ సభ్యులకు కోరాలని పేర్కొన్నారు. ప్రతిరోజు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉదయం సాయంత్రం విజిబుల్ పోలిసింగ్ భాగంగా కళాశాల,పాఠశాలలు పరిధిలో ఎటువంటి ఈవిటిజింగ్,ఇతర నేరాలు జరగకుండా చర్యలు చేపట్టాలని,వాహనాలు తనిఖీలు చేపట్టి గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. నేరాల నియంత్రణకు ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే రౌడీ షీట్స్ కలిగిన వారికి సత్ప్రవర్తనతో,చట్టాన్ని గౌరవిస్తూ జీవించాలని,నేర ప్రవృత్తిని విడనాడాలని కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ సోదాలు నిర్వహించి గంజాయి మద్యం అక్రమ రవాణా నిల్వలు పై సోదాలు చేయాలని తెలిపారు. పాత నేరస్తులు అనుమానిత వ్యక్తులపై నిఘా పెట్టీ నేర నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. నేర చరిత్ర కలిగిన వ్యక్తుల పైనా, వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టు కాబడిన నిందితులపై నిరంతర నిఘా పెట్టాలని, ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి హెచ్చరించారు.

# మేఘాలాయ ఘటన ఆధారంగా మూవీ



### ర్యూమర్లను ఖండించిన అమీర్ బృందం

సితారే జమీన్ పర్ విజయం తర్వాత బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్ట్ ఆమిర్ ఖాన్ తన తదుపరి ప్రాజెక్ట్‌గా మేఘాలయ 'హనీమూన్ మర్డర్ కేసు' ను తీయబోతున్నట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. కొత్తగా పెళ్లయిన రాజా రఘువంశీ హత్యకు గురికావడం, అతని భార్య సోనమ్ ఈ కేసులో నిందితురాలిగా ఉండటం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ సంఘటన ఆధారంగా ఆమిర్ ఖాన్ ఒక క్రైమ్ థ్రిల్లర్ నిర్మించేందుకు ఆసక్తిగా ఉన్నారని, కేసు వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారని వార్తలు వచ్చాయి. అయితే ఈ వార్తలన్నీ అవాస్తవాలని ఆమిర్ ఖాన్ తన టీమ్ ద్వారా స్పష్టం చేశారు. మేఘాలయ హత్య కేసు ఆధారంగా తాను ఎటు-వంటి సినిమాను తెరకెక్కించడం లేదని ఆమిర్ తెలిపారు. మరోవైపు ఆమిర్ ఖాన్ ప్రస్తుతం తన నిర్మాణ సంస్థలో పలు ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నారు. ఇప్పటికే తన కొడుకుతో ఎక్‌దిన్ చిత్రాన్ని నిర్మిస్తున్న ఆయన తమిళ దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో కలిసి ఒక సూపర్ హీరో సినిమా చేయనున్నారు. ఇది 2026 ద్వితీయార్థంలో షఉటింగ్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అలాగే 'మహాభారతం' అనే తన డ్రీమ్ ప్రాజెక్ట్‌పై కూడా పనిచేస్తున్నారు.

# ఎన్టీఆర్ కోసం కథం సిద్దం చేస్తున్న బాబీ

టాలీవుడ్ యంగ్ దర్శకుడు బాబీ బ్యాక్ టు బ్యాక్ హిట్స్‌తో స్టార్ దర్శకుడిగా మారుతున్నాడు. ఈ ఏడాది ఆరంభంలో నందమూరి బాలకృష్ణతో డాకు మహారాజ్ ను డైరెక్ట్ చేసిన బాబీ సూపర్ హిట్ అందుకున్నాడు. ముఖ్యంగా బాబీ గత సినిమాల కంటే డాకు మహారాజ్ ను టెక్నీకల్ గా, విజువల్ గా అద్భుతంగా తెరకెక్కించాడనే పేరు తెచుకున్నాడు. అటు చిరుకు వాల్తేర్ వీరయ్య, ఇటు బాలయ్యకు డాకు మహారాజ్ తో సీనియర్ హీరోలను బాబీ బాగా హ్యాండిల్ చేయగలడు అని నిరూపించాడు. డాకు మహారాజ్ వచ్చి దాదాపు ఆరు నెలలు దాటుతోంది. చిరుతో మరో సినిమా చేయబోతున్నాడు అని ఆ మధ్య టాక్ వినిపించింది. కానీ చిరు ఇతర సినిమాలతో బిజీగా ఉన్నాడు. అలాగే బాలయ్యతో కూడా మరో సినిమా చేయబోతున్నాడని కూడా టాక్ కూడా ఉంది. గోపీచంద్ మలినేనితో బాలయ్య చేయబోతున్న సినిమా తర్వాత బాబీ సినిమా ఉండే ఛాన్స్ ఉంది. అయితే ఇప్పుడు మరొక న్యూస్ టాలీవుడ్‌లో హల్ చల్ చేస్తోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ కోసం దర్శకుడు ఓ కథ రెడీ చేస్తున్నాడట. ఈ సినిమా పూర్తిగా అవుట్ అండ్ అవుట్ హై యాక్షన్ గా ఉండబోతుందట. డాకు మహారాజ్ లోని యాక్షన్ ఎపిసోడ్స్ కు విశేషమైన ఆదరణ లభించింది. ఇప్పుడు అంతే స్థాయి హై యాక్షన్ తో పవర్ఫుల్ స్టోరీ రాస్తున్నాడట బాబీ. గతంలో వీరి కంబోలో వచ్చిన జై లవ కుశ సూపర్ హిట్ గా నిలిచింది. వరుస సినిమాలను లైన్ లో పెట్టిన బాబీతో సినిమాను ఎప్పుడు చేస్తాడనేది ఇప్పుడు చర్చ.



# పెద్ది మూవీ కోసం విలేజ్ సెట్

'ఉప్పెన'తో సెన్సేషనల్ డెబ్యూ ఇచ్చిన బుచ్చిబాబు సాన డైరెక్షన్‌లో రామ్‌చరణ్‌తో పెద్ది మూవీ తెరకెక్కుతోంది. కథకు ప్రధానమైన సన్నివేశాలు విజయనగరం నేపథ్యంలో చిత్రీకరించాల్సి ఉంది. అయితే అక్కడి వాతావరణం షఉటింగ్‌కు అనుకూలంగా లేకపోవడంతో, ఆ సీన్లను హైదరాబాద్‌లో ప్రత్యేకంగా సెట్ వేసి తీయాలని చిత్రబృందం నిర్ణయించింది. ఈ సెట్ కోసం ఏకంగా రూ. 5 కోట్లు ఖర్చు చేస్తున్నట్టు- సమాచారం. ఈ సినిమా రూరల్ స్పోర్ట్స్ డ్రామా కాగా, ఇందులో రామ్ చరణ్ ఒక క్రికెటర్ పాత్రలో కనిపించబోతున్నాడు. ఇప్పటికే విడుదలైన చిన్న గ్లింప్స్‌కి అభిమానుల నుంచి భారీ స్పందన వచ్చింది. కథ, లుక్ విభిన్నంగా ఉండనుందని తెలుస్తుంది. వచ్చే ఏడాదిలో ఈ మూవీ రిలీజ్ కానుంది. చిత్రానికి ఆస్కార్ విన్నింగ్ కంపోజర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ట్యూన్స్ రెడీ అయ్యాయని సమాచారం. మాస్ నేపథ్యంలో సాగే కథకు రెహమాన్ ఇచ్చే మ్యూజిక్ ఎంతగా ఎలివేట్ చేస్తుందో అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ సినిమాలో హీరోయిన్‌గా బాలీవుడ్ బ్యూటీ- జాన్వీ కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దేవరతో టాలీవుడ్ ఎంట్రీ- ఇచ్చిన ఆమె, వెంటనే రామ్ చరణ్ సరసన ఛాన్స్ కొట్టేసింది. ఇక 'పెద్ది' కోసం రామ్ చరణ్ బాడీ ట్రాన్స్ఫర్మేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నాడు.. ఇటీ-వల ఆయన జిమ్‌లో వర్కౌట్ చేస్తున్న ఫోటో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.





# ఉస్తాద్ భగత్ సింగ్‌లో మరో హీరోయిన్

### శ్రీలీలకు తోడుగా రాశీఖన్నా చేరిక

పవన్ కల్యాణ్ ,హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా అప్‌డేట్స్ కోసం పవన్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా వారికి ఈ టీమ్ ఓ అప్‌డేట్‌ను అందించింది. ఇందులో శ్రీలీలతో పాటు మరో కథానాయిక కూడా ఉన్నట్లు- తెలుపుతూ పోస్టర్‌ను పంచుకుంది. ఉస్తాద్ భగత్‌సింగ్'లో నటి రాశీఖన్నా భాగమైనట్లు ఎన్నో రోజులుగా వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఇప్పుడీ విషయాన్నే దర్శక నిర్మాతలు అధికారికంగా ప్రకటిస్తూ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో ఆమె 'శ్లోక' పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు. తన పాత్రతో సినిమాకు మరింత అందాన్ని తెస్తుందన్నారు. ప్రస్తుతం ఆమె షఉటింగ్‌లో పాల్గొంటున్నట్లు- చెప్పారు. ఇప్పటికే ఈ సినిమాలో శ్రీలీల భాగమవగా ఇప్పుడు రాశీ కూడా ఇందులో నటిస్తుండడం మరింత ఆసక్తిగా మారింది. గబ్బర్‌సింగ్' తర్వాత పవన్‌కల్యాణ్, హరీశ్ శంకర్ కాంబోలో రూపొందుతోన్న ఈ చిత్రంపై ప్రేక్షకులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇందులో పవన్ కల్యాణ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇకపోతే పవన్ నటించిన 'హరి హర వీరమల్లు' జులై 24న విడుదల కానుంది. ఈసందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పవన్ లుక్‌కు అందరూ ఫిదా అయ్యారు. దీనిపై ఓ అభిమాని పోస్ట్ పెట్టగా.. దానికి హరీశ్ శంకర్ సరదాగా రిప్లై ఇచ్చారు. పవన్ ఉస్తాద్ లుక్ అదిరిపోయింది. ఓ అభిమానిగా హరీశ్ శంకర్ ఆయన్ని అద్భుతంగా చూపించనున్నారని అర్థమవుతోందని పోస్ట్ పెట్టారు. దీనికి దర్శకుడు రిప్లై ఇస్తూ.. 'తరతరాలుగా.. నరనరాల్లో ఆయనపై అభిమానం ఉప్పొంగుతోంది' అని అన్నారు.



Edited, Printed, Published by K. SUNITHA, Printed at H.No. 40/368-B, 1ST FLOOR, VIDYA NAGAR, KURNOOL - 518001, A.P.,
**SRAVANI OFFSET PRINTERS, BESIDE DURGA TRACTORS, GOOTY ROAD, KURNOOL -518002**, A.P., **Editor : K. SUNITHA,**
Cell No. 891 902 4979, Email:sunitharajworks@gmail.com, RNI No. **APTEL/2010/31893,** WebSite : www.kothaswaram.com